# 25. కనువిప్పు

రాజు జానకిని పెళ్ళాడుతాడనే వార్త అతన్ని తెలిసినవారందర్నీ ఆశ్చర్య చకితుల్ని చేసింది. మొదట్లో ఎవ్వరూ నమ్మలేదు. కాని రాజు తన నిశ్చయాన్ని తెలియ బరిచినప్పుడు యిక నమ్మక తప్పనూలేదు.

"నీకు మతి పోయిందా?" అన్నారు ముఖ్య మిత్రులు.

"ఏం? ఎందుకనీ?" అన్నాడు రాజు చాలా ప్రశాంతంగా.

"ఎందుకేమిటి నీ మొహం? మేనమామ కూతురు, లక్షలకు అధికారిణి, ఆ తండ్రికి ఒకే కూతురు, నిన్ను మనసారా ప్రేమించిన శారదను వొదిలి యీ బికారిని రోజుకు పూటగడవటం కనాకష్టమైన కుటుంబంలోంచి వొచ్చిన జానకిని పెళ్ళాడట మేమిటి?" అన్నారు మిత్రులు.

"కట్నాలకూ, కానుకలకూ ఆశపడకూడదనీ, సమాజాన్ని మరామత్తు చేయాలనీ, అనాథలుగా వున్న స్త్రీలను ఉద్ధరించేందుకు భారత యువకులమైన మనం నడుంకట్టాలనీ అనేకసార్లు పెద్ద పెద్ద లెక్చర్లు కొట్టాం కదా! మరి మనమే వెనుకంజ వేయటమేమిటి? ఎవరికి చేతనైన మంచిని వారు చేసేట్లయితే, సమాజం దానంతటదే బాగుపడుతుంది. అంతే కాని గొంతులు ఎండిపొయ్యేట్లుగా వాగినంత మాత్రాన ఏమౌతుందీ? ఒక ఆదర్శంకోసం సమాజంలోని ప్రతి వారూ శక్తి వంచన లేకుండా త్యాగం చేయాలి. నాకు చేతనైనదాన్ని చేయటం నేరమా?" అన్నాడు రాజు.

మిత్రుల నోళ్ళు కట్టుబడినయ్. ఆదర్శాలను గూర్చి అందరూ వాగిన వాళ్ళే కాని, అందులో ఒక్కళ్ళన్నా ఆ ఆదర్శాన్నంతనూ కాకపోయినా, అందులో

కొంతభాగాన్నయినా, నిత్య జీవితంలో అనుసరించగల సామర్థ్యాలున్నవారెవరు? తీరా సమయం వొచ్చేప్పటికి వెధవ ఆదర్శాన్ని వెనక్కు నెట్టి, ఈ ప్రపంచంలో తమ ఆదర్శాన్ని వొదులుకున్నట్లయితే వొచ్చిపడే ధనాన్ని చూసి, ధనం వైపే మొగ్గుదామని కూడా ఎప్పుడో నిర్ణయించుకున్నారు; పైకి మాత్రం కేవలం గాలితిత్తుల్ని వూరించి, కాస్త మంచి భాషలో తమ ఆదర్శాన్ని గూర్చి వాగినంత మాత్రాన వొచ్చేదీ, పొయ్యేదీ ఏమీలేదు కనుక, అంతవరకూ అందరూ సమర్థులేనని పించుకున్నారు. కాని, ఆ ఆదర్శం తమకే ఒక అగ్నిపరీక్షయితే నిలబడే ఉద్దేశ్యమే ఒక్కరికీ లేదు.

ఇప్పుడు రాజు నిజంగానే ఆ ఆదర్శం కోసం ఆహుతయేందుకు సిద్ధపడితే, మిత్రులు అతన్ని మెచ్చుకోవాల్సిందిపోయి 'అతనికి మతి పోయింది' అన్నారంటే, వారి అభిప్రాయాలు ఎంత బలహీనమైనవో రుజూ ఐనట్లే!

రాజును చూసి సిగ్గుపడి, తాము అతని వలె ఆదర్శం కొరకు నిలబడలేక పోయినందుకు తమ అల్పత్వానికి కించపడి వుండవలసింది! మొత్తం మీద రాజు తన అభిప్రాయాన్ని బైటపెట్టిన తరువాత మిత్రుల మొహాలు మాడినయ్.

ఐనప్పటికీ మంచివాడూ, తామందరికీ ఎంతో కావలసినవాడూ ఐన రాజును, యీ ప్రమాదం నుంచి తప్పించేందుకుగాను, ఇంకేమైనా కారణాలు వుండగలవేమోనని మిత్రులు ఆలోచించారు. ఆదర్శంకన్నా, మిత్రుడు బాగుపడటం, సుఖపడటం ఎక్కువని వారికి అనిపించింది.

"అది కాదు--" అన్నా డొక ప్రబుద్ధుడు. "శారదేమో నిన్ను మనసారా ప్రేమించిందాయె! ఈ జానకి నిన్ను ప్రేమించిందనేమిటి? అసలు ఆమెకూ నీకూ పరిచయమై ఎన్నాళ్ళు కనుక?"

"ప్రేమ!" అని నవ్వాడు రాజు. "ప్రేమ ఒక్కటేనా ప్రపంచంలో కావాల్సింది? కట్నాలతో ఆమె యీనాడు భర్తను తెచ్చుకోలేదు. ఆమెను పెళ్ళాడితే సమాజంలో ఆమె ఎదుర్కొంటున్న ఒకానొక కఠిన సమస్యను నేను తీర్చగలను. ఆమె మీద జాలి నన్నామెపట్ల ఆకర్షించింది."

"ఆమె సమస్యల్ని నీవు తీర్చవొచ్చు కాని, నీకు ఎదురయ్యే దారుణమైన సమస్యల్ని గూర్చి ఆలోచించటంలేదు; వాటిని ఆమె తీర్చలేదు; నీకు నీవూ తీర్చుకోలేవు" అన్నారు మిత్రులు.

"ఏమిటవ్వి?" అన్నాడు రాజు.

"నీవు తల్లితండ్రులకు దూరమౌతావు. మీ నాయన దమ్మిడీ ఇవ్వడు. అటు శారదను చేసుకుంటే ఆమె ఆస్తిపాస్తులే చాలు. ఇప్పుడేమౌతావ్? నిరాధారంగా నీ బతుకుతో పాటు, జానకి బతుకు భారాన్ని కూడా యీడవాల్సి వుంటుంది" అన్నారు మిత్రులు.

"ఏం పెద్ద ఆస్తి లేకపోతే? కష్టపడి సంపాదిస్తాను" అన్నాడు రాజు.

"అది అంత తేలిక కాదు--"

"కాకపోవచ్చు. చివరకు రిక్షా లాగైనా సరే బతుకుతాం. ఆదర్శమనే దాన్ని సాధించుకునేందుకు ఎన్ని అవస్థలైనా పడాలి మరి. మాటలు చెప్పినంత తేలికా?" అన్నాడు రాజు.

ఇక వాదనకేముందీ? రాజు పట్టుదల అందరికీ తెలిసిందే! చెప్పి లాభం లేదు. అందుకని మిత్రులు నీ ఖర్మకు ఏం చేస్తాం? నీ గతి కుక్కలకూ నక్కలకూ తెలుస్తుంది!' అని శపించారు.

ఆ శాపాన్ని గ్రహించి రాజు మిత్రుల నుంచి విడిపొయ్యాడు.

ఇంట్లో విషయాలు అనుకోనంత ఘోరంగా తయారైనవి. తండ్రి ఎంతో చెప్పి చూసి, చివరకు ఆస్తిలో దమ్మిడీ కూడా ఇవ్వనని బెదిరించాడు. తల్లి ఉపవాసాలు చేసి, కన్నీళ్ళతో వేడుకుంది.

కాని రాజు చలించలేదు. ఏమైతే అదే అవుతుందనుకున్నాడు. ఆదర్శం కోసమై కుటుంబాన్నీ, తన సర్వస్వాన్నీ వొదులుకునేందుకే సిద్ధమయ్యాడు; ఎదురుగా వొచ్చిన అదృష్ట దేవతను కాలతన్నాడు. వెధవ మనస్సు దాని ఇష్ట ప్రకారం ఎటుపడితే అటు తిరగకుండా ఉండేటట్లుగా దాని పీక నొక్కాడు.

"నా ఇంట్లోంచి వెళ్ళిఫో... నీ గతి కుక్కలకు తెలుస్తుంది!" అన్నాడు తండ్రి.

"నీకు సుఖపడే గీత లేదు. నీ ఖర్మ!" అని నెత్తీ నోరూ కొట్టుకొంది తల్లి.

ప్రపంచమంతా ఇలాటి అభిప్రాయాలనే వెలి బుచ్చింది. ఒక్కరన్నా తాను అనుసరించే ఆదర్శంలోని గొప్పతనాన్ని గ్రహించలేదు; వాళ్ళు అనుసరించలేకపోయినా, అనుసరిస్తూన్న తనకు ప్రోత్సాహకరంగా, మాట వరసకన్నా అనలేదు. పై పెచ్చు అందరూ తనను శపించారు.

చిత్రమేమిటంటే - ఎంతమంది తన వెంటపడి బతిమాలినా, భంగపడినా, ప్రార్థించినా, దూషించినా, శపించినా, తాను చలించలేదు సరికదా, క్షణక్షణానికీ తన పట్టుదల పెరిగింది.

శాపగ్రస్థుడైన దేవత వలె, స్వర్గం నుంచి బలవంతంగా భూమి మీదికి తోసి వేయబడి, మట్టిలో పొర్లాడి, అమానుష శక్తు లన్నిటినీ కోల్పోయి, కేవలం మౌనమాత్రుడుగా నిలబడగలిగిన దురదృష్టవంతునివలె రాజు విశాల ప్రపంచంలో పడ్డాడు.

అతని ఆధారమల్లా ఆ మహదాశయం. తాను కూడా సమాజానికి కొంతలో కొంతగా ఉపయోగపడి, ఆదర్శ జీవితాన్ని గడపాలనే సదుద్దేశ్య మొక్కటే! అతను

తన ప్రపంచంలో ఎవర్నీ నమ్మలేదు ఒక్క తన అంతరాత్మను తప్ప! ఏది మంచో, ఏది చెడో అది చెపుతోంది; ఆ ప్రకారమే తాను నడుచుకుంటున్నాడు. మధ్యలో ఎదురైన ఆటంకాలన్నింటినీ అతను లెక్క చేయలేదు.

"ఇంతకూ జానకి అదృష్టవంతురాలు!" అనుకున్నారు, అతని పరిచయస్థులు సైతం.

"రాజు దురదృష్టవంతుడు!" అని కూడా అనుకున్నారు. జానకి కూడా తాను ఎంతో అదృష్టవంతురాలి ననుకుంది.

ఐతే లోకమంతా 'నీకు మతి పోయింది!' అని కోడై కూస్తున్నప్పుడు, ఎంత విజ్ఞుడైనా చలించక మానడు. అంతరాత్మ ఎంతగా ఎలుగెత్తి ఘోషించినా, నిజంగానే తనకొకవేళ మతి పోయిందేమోననే అనుమానమన్నా కలగక మానదు.

అందుకనే రాజు తనను తాను ప్రశ్నించుకున్నప్పుడు 'ఛా! ఎవరన్నారు? ఈ వెధవలంతా జేరి నిన్ను మతిలేని వాడన్నారంటే, వాళ్ళ మతులు ఎంత వక్రమార్గాన నడుస్తున్నవో వాళ్ళకే తెలియదు. వీళ్ళెవరివల్లా కాని పనిని నీవు సాధిస్తున్నావనే ఈర్ష్య తప్ప, నీ మేలు కోరికూడా ఆ మాటలన్నారంటే నమ్మేందుకు వీల్లేదు. ఐనా నీవు చేసేది నేరమూ, అవినీతి అని ఎవ రనగలరు? నిస్సహాయ స్థితిలో వున్న వేరొక మానవప్రాణికి అండగా నిలవటం అధర్మమెలా అవుతుంది?... నీ నిశ్చయం వెనుక వున్న ఆ సంఘటన వీళ్ళెవరికీ తెలియదు; తెలియచెప్పినా వీళ్ళెవరికీ అర్థం కాదు. అందాకా ఎందుకూ? ఆ సంఘటనను ఒక్కసారి జ్ఞాపకం చేసుకో నీకే తెలుస్తుంది!' అన్నది అంతరాత్మ.

మరోక్షణంలోనే ఆ సంఘటన యథాతథంగా అతని మనోఫలకం మీద తిరగసాగింది:

జానకికీ తనకూ కేవలం ఐదారు నెలల పరిచయం మాత్రమే వుంది. అదీ ఒక స్నేహానిక్కూడా రూపురేఖలు దిద్దుకున్నదనేందుకు వీల్లేదు. ఐతే జానకి తెలివిగలదే ఐనప్పటికీ, ఆమె సౌందర్యం తనను ఆకర్షించదగింది మాత్రం కాదు! కాలేజీలో చదువుకునే ఆడపిల్ల లందరికన్నా బీదది కావటం వల్ల, పై మెరుగులు ఆమెకు అందుబాటులో లేవు. జీవితమే నిరుత్సాహకరంగా గడుపుతూ, ఏవో గొప్ప సమస్యల్లో వేగిపోతూన్నట్లే కనిపించేది.

ఇలాటి వ్యక్తిత్వం విద్యార్థుల దృష్టిలో హాస్యాస్పదమైనదిగానే ఉండేది. ఆమె దైన్యమే తనను ఆకర్షించింది. మొదట ఒక రకం జాలితో ఆరంభమై, క్రమంగా తీవ్రమైన సానుభూతిగా మారింది.

తనలాటి ధనిక వర్గంలోని వ్యక్తితో ఆమె స్నేహం చేసేందుకు కుతూహల పడిందేమో కాని, అందువల్ల తన నిజ స్థితి బైటపడిపోతుందని మాత్రం భయపడిందని

తాను గ్రహించగలిగాడు. తాను ఎంత మనసిచ్చినా, ఆమె ఒక్కనాడన్నా తన వ్యక్తిగత జీవితాన్ని గూర్చి మాట్లాడలేదు.

ఇందువల్ల తాను తెలుసుకోదగింది, తెలుసుకునేందుకు ఎలాటి ఇబ్బందీ కలగదు. ఎందుకంటే సెలవు రోజుల్లో తాను ఆహ్వానం లేకుండానే జానకి ఇంటికి వెళ్ళేవాడు. కాలేజి చదువులు సాగించగల సంసారాలు ఇంత హీనస్థితిలో ఉంటయ్యని అతనెప్పుడూ అనుకోలేదు.

ఇంటి నలుమూలల్లోనూ బూజుతోపాటు ఆర్థిక స్థితి కూడా స్పష్టంగా కన్పిస్తోంది. ఆమె తరువాత నలుగురు బిడ్డలున్న సంసారం. తండ్రి ఫాక్టరీలో గుమస్తాగా కనీసం ముప్పై ఏళ్ళ నుంచీ పని చేస్తున్నాడు; పదేళ్ళకి ఇనుప యంత్రాల్లాటివే అరిగిపోయి, పనికిరాకుండా పోతవంటే, ముప్పై ఏళ్ళలోనూ మూడు మానవ జీవితాల చాకిరన్నా ఆయన చేసివుంటాడనేది ఆయన్ను చూస్తే అర్థంగాకపోదు! జానకి గాక మరి నలుగురు పిల్లల చదువు సంధ్యలు కూడా చూడటం ఆ ముసలాయనకు భారమే మరి!

మరి జానకి– ఆడపిల్లకు యీ పెద్ద చదువులెందుకు? ఈ ప్రశ్నకు ఒక జవాబేమి దొరికిందంటే – ఆమె యీ చదువుతో ఉత్తరోత్రా ఏమన్నా సంపాయించి సంసారాన్ని గడుపుతుందేమోననే ఆశేమో?

కాని ఎప్పటి సంగతో, దేవుడి కెరుక; ప్రస్తుతం వీళ్ళ సంసారం పడే బాధలు చూస్తే జానకి కింద ఆయన సంపాదనలో కనీసం సగమన్నా ఖర్చవుతూండి ఉండాలి. అర్థాకళ్ళతో యీ చదువులు చదివించకుంటేనేం?

ఈ స్థితిలో జానకి మనస్తత్వం ఎంత గాయపడి వుంటుందో, ఎంత అసంతృప్తితో ఆమె రోజుల్ని దొర్లిస్తూండి ఉండాలో, తాను గ్రహించ గలిగాడు. ముఖ్యమైన అనేక పుస్తకాలు ఆమెకు లేవు; కొనుక్కునే శక్తి లేకనే సరిపెట్టుకుంది. కాస్త మంచి చీరలన్నా లేవు పాపం!

ఈ విషయాలే తన ఊహల్ని ఆక్రమించి వేధించినవి. పోనీ జానకి తన పట్ల మిత్రత్వాన్ని ప్రదర్శించి, తాను చూపే సానుభూతిని ధన రూపానికి మార్చుకునేందుకన్నా ప్రయత్నిస్తుందేమోనని చూశాడు; కాని ఆమె ఎంతకూ తన లేమిని తెలియనీయకుండా, చల్లని వెన్నెలలు విరిసే చిరునవ్వులు విసిరేసేందుకే ప్రయత్నిస్తుంది; ఆ నవ్వు వెనుక దాగిన అగాధాలు స్పష్టంగా తనకు కనిపిస్తూనే ఉన్నవి.

జానకి అభిమానవతి కావటం వల్ల, ఆమె తన సహాయాన్ని అర్థించకుండానే, బాధలు పడేందుకు సిద్ధపడింది. ఇందువల్ల తనకు ఆమెపట్ల గౌరవం పెంపొందింది.

తనంతట తానుగా ఆమెకు సహాయపడదామనుకోకపోలేదు. కాని అలాటి అవకాశాన్ని జానకి కలగనీయటం లేదు. సున్నితమైన యీ పరిచయం చెడుతుందేమోననే తనూ పస్తాయించాడు.

అనేక రాత్రులు జానకి గూర్చి తల బద్దలు కొట్టుకున్నాడు. ఆమె మీద కలిగిన జాలి పర్వత ప్రమాణాలకు పెరిగింది.; దానికి విడుదల అవసరం. తాను మరి భరించలేడు. తన బతుకు తాను బతకటం ఒక సమస్యే కాదు. తాను కనీసం మరొక్క జీవితాన్నన్నా ఉద్ధరించగలుగుతే తన జన్మ సార్థకమవుతుంది.

ఇందువల్ల వ్యక్తిగతంగా తనకు వొచ్చే నష్టాలంటూ ఉన్నా మరేం ఫర్వాలేదు. ఎందుకంటే ఎంతమంది మానవోత్తములు సమాజ శ్రేయస్సు కోసం ఆహుతై త్యాగశీలురు కాలేదు కనుక! వారు వారి సుఖాల్నే చూసుకున్నారా? వారి చరిత్రలు తనబోటి సామాన్యులకు ఆదర్శపాత్రమైనవి కావా?

దేనికైనా సమయం రావాలి కదా! ఒకనాడు అలాటి సమయం దానంతటదే వొచ్చింది:

ఆదివారం మధ్యాహ్నం జానకిని చూడబొయ్యాడు. ఆమె ఇంట్లో లేదు.

“ఇప్పుడే వొస్తానని వెళ్ళింది...కూర్చోండి” అందామె తల్లి.

ఆమె తప్ప ఇంట్లో ఎవ్వరూ లేరు. పోలీసు కాల్పుల తర్వాత చుట్టూ వెళ్ళాడే భయంకర నిశ్శబ్దతలాటిది కమ్ముకుంది. జానకి వొస్తేనే కాని భారమైన వాతావరణానికి తరుణోపాయం ఉండదు.

చేసేది లేక కూర్చున్నాడు. ఏమీ తోచకనే జానకి పుస్తకాలు తీయసాగాడు. ఒక పుస్తకంలో అంటించని కవరున్నది. ఎందుకనో కాని ఆ కవరులో ఏమున్నదో చూడాలనే కుతూహలం అతన్ని కాల్చివేసింది.

చూస్తే అదొక ఉత్తరం.

ఇతరుల ఉత్తరాల్ని చదవాలనే వాంఛ తన కిదివర కెప్పుడూ కలగలేదు; అదొక దురలవాటని కూడా తెలుసు. ఏమైనా సరే జానకి వ్యక్తి గత జీవితాన్ని తెలుసుకునేందుకుగాను తాను చేసే, చేస్తున్న అనేక ప్రయత్నాల్లో ఇదీ వొక టనిపించింది. ఆమె పడే కష్టాలు తెలుసుకొని, వాటికి ప్రక్రియలు ఆలోచించి, ఆమెకు అండగా నిలబడాలనే తాను ప్రయత్నిస్తున్నాడు. చేసే పని చెడ్డదయినా, దాని ఫలితం సదుద్దేశ్యంతో కూడినదే కావటం వల్ల, తనను తాను సమర్థించుకున్నాడు. ఎక్కువ ఆలోచన లేకుండానే ఆ ఉత్తరాన్ని చదవసాగాడు:

“నాన్నా!

నే నీ ఇంట్లో పుట్టటం నా దురదృష్టమని ఎన్నడూ అనుకోలేదు. కాని అది మీ దురదృష్టమని అనేకసార్లు అనుకున్నాను. ఇరవై యేళ్ళ పాటు నన్ను పెంచారు. చదువు సంధ్యలు చెప్పించారు. నేను కనీసం మగవాణ్ణయినా, ఏ కాయకష్టంతోనో నీకూ,

కుటుంబానికీ సహాయపడి వుండేదాన్ని. కాని ఎందుకూ పనికిరాని ఆడపిల్లనైపోయ్యాను. అందుకనే కనీసం కుటుంబభారాన్ని తగ్గించే అవకాశం కూడా నాకు లేకపోయింది.

ఎన్నాళ్ళని మీ సంపాదనలోని అధిక భాగాన్ని పంచుకుంటూ, ఆత్మ బంధువులందరూ బాధపడుతూ, ఉప్పని కన్నీటితో కలిపిన భోజనాలు చేయటాన్ని చూడగలను? ఆశయాలూ, ఆదర్శాలూ ఏనాడో మరిచిపొయ్యాను. కేవలం బతకగలిగితే చాలనిపించింది. అదీ లాభం లేదని తెలుసుకోగలుగుతున్నాను.

ఎదిగిన ఆడపిల్ల ఇంట్లో ఉండటం, తల్లిదండ్రులకు రొమ్ముల మీద కుంపటే మరి! ఎలాగైనా నన్నొక అయ్య చేతుల్లో పెట్టి ధన్యులవాలని మీరు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కాని అర్థబలం, అంగబలం లేనివారు, ఎంత బలహీనంగా పోరాడాలని చూశారో కూడా నాకు తెలుసు.

చివరకు మూడో పెళ్ళివాడికి నన్నివ్వాలని చూసినప్పుడు నేను ప్రతిఘటించి, తిరస్కరించాను.

చాలా పొరపాటయింది నాన్నా! ఆనాడు నాలో కేవలం ఉడుకు రక్తం, నాకు జరుగుతూన్న అన్యాయాన్ని గూర్చిన ఆవేశం తప్ప, మరొకటి పని చేయలేదు. నాకు చదువు చెప్పించింది, జాగర్తగా ఆలోచించే సామర్థ్యం వుండ గలదని. కాని ఆ నాడు నా బుర్ర పనిచేయలేదు. వ్యక్తిగతంగా నాకు జరిగే అన్యాయాన్ని గూర్చి బాధపడ్డాను కాని, నా వల్ల యీ కుటుంబానికంతకూ జరుగుతూన్న అన్యాయాన్ని గూర్చి ఒక్క క్షణం కూడా ఆలోచించలేక పొయ్యాను.

ఈనాడు నేనొక్కతెనూ బాధపడినట్లయితే, మీ రందరూ సుఖపడతారనీ, ఇరవైఏళ్ళపాటు నా కోసమై శరీరంలోని ప్రతి రక్తకణాన్నీ వెచ్చించినందుకన్నా కృతజ్ఞత చూపటం నా కనీస కర్తవ్యమనీ నిశ్చయించుకున్నాను. ఐతే త్యాగం చేసేందుకు సిద్ధమైనప్పుడు ఆ అవకాశాలు ఎదురుచూస్తూ మన కోసం అలాగే తలుపులు తెరుచుకొని కూర్చుంటవని పొరబడ్డాను.

నాకోసమని రాజకుమారులొస్తారని నే నెన్నడూ కలలు కనలేదు నాన్నా! నేనొక అందగత్తెననీ పొరబడలేదు. కట్నాలు లేకుండా నా జీవిత శేషాన్ని భరించగలవాడే, యీనాడు నాకు లోకోత్తర పురుషుడుగా భావించాను. ముందు నీకు బరువు తగ్గించాలనే చూశాను.

కాని ఒక్కరూ ముందుకు రాలేదు. దేశంలో ఆదర్శాల్ని గూర్చి మాట్లాడే వారే అందరూను; కాని మచ్చుకన్నా ఆచరణలో పెట్టేందుకు ఎవ్వరూ ప్రయత్నించరే!

నాకు మేలు జరగలేదని కాదు. మాటలకూ చేతలకూ అగాధాలు స్పష్ట మౌతున్నందు కేనా విచారం!

ఆనాడే మీ మాట విని ఆ మూడోపెళ్ళికి సిద్ధమైన పెద్దమనిషిని వరించి ఉండవలసింది. ఇప్పుడేమనుకొని ఏం లాభం? మిమ్మెంత గాయ పరిచానో, ఎప్పటికీ మీకు వదలకుండా నట్టింట్లో పట్టంకట్టుకొని కూర్చున్న పెద్దమ్మవారల్లే తయారయానో, నేను తెలుసుకోగలుగుతున్నాను. మీరు ఒక్క మాటన్నా పైకి అనక, ఒక అగ్నిపర్వతాన్నే హృదయంలో భరించగలిగారు. సంవత్సరాల తరబడిగా ఆ పర్వతాలు తమలో రోజు రోజుకూ పెరిగిపోతున్నవి: ఇంత దీనావస్థలో మిమ్ము చూసి భరించలేను.

జీవించి సాధించేది మాత్రం ఏముంది కనుక? ఈ జీవితానికి ఆహుతవటం నన్నా, రోజు రోజుకూ ఖండ ఖండాలుగా యీ శరీరాన్ని జీవితానికి ఎరలుగా వేయటం కన్నా, ఒక్కసారే జీవితాన్ని త్యజించినట్లయితే నా సమస్యలన్నీ వాటంతటవే పరిష్కరించబడుతవి; దాంతోపాటు మీ సమస్యలు కూడాను.

నాన్నా! యీ ఉత్తరం నీకు అందే వేళకు బహుశా నేనీ ప్రపంచాన్నే వీడుతాను. తాత్కాలికంగా మీరు దుఃఖించినా, కొన్నాళ్ళ తర్వాతయినా మీరందరూ కొంతలో కొంతన్నా సుఖపడతారని ఆశిస్తున్నాను. నేను మీ పట్ల చూపిన కఠినత్వాన్ని క్షమించండి. అదే నా ఆత్మకు శాంతి......

జానకి.

ఉత్తరం పూర్తి చేసేప్పటికి కంటి నుంచి వెలువడిన ధారల వల్ల తానేమీ స్పష్టంగా చూడలేక పోతున్నాడు. కళ్ళు తుడుచుకోవటం ద్వారా ఆ ఇబ్బంది పోయింది కాని శరీరంలో ప్రవహించే వేల వోల్టుల విద్యుత్ సంగతేమిటి?

కేవలం మానవమాత్రుడైన తాను భరించలేని అగ్ని కణాల వేడి, కళ్ళ ముందు ఒక మానవప్రాణి భస్మీభూతమౌతుందనే భయం, ఎలాగైనా ఆ ప్రాణిని రక్షించాలనే దృఢ నిశ్చయం, కరుణాసాగరంతో ఆమెను ముంచెత్తి ఆ బడబాగ్నిని చల్లార్చాలనే పరిష్కార మార్గం - ఇంకా తనకు అర్థంకాని అనేక భావాల సంచలనంతో ఊగిపొయ్యాడు. తాను జాగర్తగా అర్థం చేసుకోగలుగుతున్నాడు కనుక, యీ షాక్‌కు తట్టుకున్నాడు కాని, మరొక సందర్భంలో ఐతే కళ్ళు తిరిగి మూర్ఛపోవలసి వొచ్చేది.

తాను నిజంగా జానకికి సహాయపడదలుస్తే ఇదే మొదటి అవకాశం, చివరిది కూడాను. పాపం! అమాయకంగా పెరిగి, సామాజిక దురాచారాల మధ్య నలిగిపోతూ కూడా, ఆమె ఎవర్నీ ఏమీ అనలేదు; ఒక ఆచారంగానే వొస్తూన్న కర్మ సిద్ధాంతాన్ని నమ్మి, తాను బాధపడటం కేవలం తన తప్పుగానే భావించి, సరిపెట్టుకుంటోంది.

ఆమె సమస్యను పరిష్కరించగలవారు కొన్ని వేలమంది వున్నారు; వీరిలో ఒక్కరు ముందుకొస్తే చాలు. ఐనప్పుడు జానకి కానీ, జానకి లాటి నిర్భాగ్యురాండ్రు కానీ సమాజం, లేదా సమాజంలో కొంతమంది స్వార్థపరుల కారణంగానే, తమ జీవితాలు భగ్నమౌతున్నవని అనుకోరంటే, తమ జీవితాన్ని ఉద్ధరించటం ఎవరి చేతుల్లో వుందో,

సర్వనాశనం చేయటం కూడా వారి చేతుల్లోనే వుండి వుండాలని నమ్మరంటే, ఎంత గుడ్డిగా బతికేందుకు అలవడ్డారో స్పష్టంగా తెలుస్తూనే వుంది.

ఎవరి సంగతో దేనికి? జానకి సమస్యేమిటో పరిపూర్ణంగా తెలిసిన తను, ఆమె జీవితాన్ని చాలించకుండా అడ్డుపడి, ప్రపంచంలో ఆమెకొక స్థానం కలిగించగల తన సంగతే ముందుగా ఆలోచించాలి.

ప్రతి మానవుడూ తాను బతికేందుకు, సుఖపడేందుకు ప్రయత్నిస్తూనే వున్నాడు. కాని జీవితంలో ఒక్క వ్యక్తిని మృత్యువు నుంచి, బలవన్మరణం నుంచి కాపాడగలగటం ఎంతమంది చేయగలరు? అసలు ఆ అవకాశాలు ఎంతమందికి వొస్తవి? వొచ్చినా వాటిని ఉపయోగించుకొనేందుకు సిద్ధపడిన వారెవరు?

నిజంగా తాను జీవితమంతా గడిపినా, తనతోపాటు మరొకర్ని ఉద్ధరించాననే ఆత్మతృప్తి మరోవిధంగా పొందగలడా? ఇందువల్ల తనకేదో కీర్తి వొస్తుందనీ, తాను మానవోత్తముడుగా మారాలనీ కాదు. కేవలం మానవత్వమనేది తనలోనూ ఉన్నదని తనకు తాను తృప్తిపడితే చాలు.

ఒక్కొక వుద్రేకం ఎంత బలవత్తరమైనదో తాను తెలుసుకో గలుగుతున్నాడు. ప్రణయం పేరుతో జరిగే లేచిపోవటాలూ, కొట్లాటలూ, ఆత్మహత్యల వెనుక అతి శక్తివంతమైన ఉద్రేకాలున్నవి. కోపంతో ముందు వెనుకలు ఆలోచించక ఖూనీలు జరిగినవి. అలాగే ద్వేషంతో దగ్ధమై పోకుండా, ఆ మంటల్ని వేరొకరి మీదికి ఎగదోయటమూ తనకు తెలుసు. ఇప్పుడు తనలో ఉద్భవించిన యీ అపార కరుణ తాలూకు ఉద్వేగం కూడా అలాటిదే!

ఈ సమయంలో తాను జానకి కోసం చేయలేని దేమిటి? తన శక్తికి మించిన ఏ పనయినా సరే చేయగలడు. పై వాళ్ళకు యీ అనుభూతి లేదు కనుక, వారికి విచిత్రంగా వుండుగాక! కాని తన అంతరాత్మ ఆదేశించిన ప్రకారం నడుచుకోవటం, నడుచుకో గలగటం ఎంత ఆనందం!

జానకికీ తనకూ మధ్య ప్రణయం లేదనే సంగతి ఆలోచించలేదు. ప్రణయానికి బాహ్యాకర్షణలు ఎంత శక్తి నిస్తవో, చేసిన మేలు తాలూకు కృతజ్ఞత కూడా అంత ఆకర్షకంగానూ ఎందుకు వుండరాదు? ధనాశతో ప్రణయం లేకుండానే పెళ్ళాడి, ఆ ధనం మీద చూపే మమకారాన్నే ధనవంతుని మీద చూపటం జరుగుతూనే వుంది. అన్నిటినీ మించి తనకు ప్రాణభిక్ష పెట్టిన వాడికి, ఆమె ప్రణయభిక్ష పెట్టలేకపోదు.

చేయకూడని పనులు చేయటం ఒకొకప్పుడు ఎంతో మేలవుతుంది. జానకి ఉత్తరాన్ని తాను చదవకుండా వున్నట్లయితే, ఆమె తప్పక ఆత్మహత్య చేసుకునేది! ఇప్పుడు తానొక మానవప్రాణి అంతరించకుండా కాపాడే అవకాశం, ఆ చేయకూడని పని వల్లనే సాధించబడుతోంది. ఇంకా నయం! ఇప్పటికే అంతా మించిపోలేదు!

ఈ సమయంలో శారద గుర్తుకు రాకపోలేదు. శారదను పెళ్ళాడేందుకు తనకన్న యోగ్యులైనవారు, అందగాళ్ళు, రాజకుమారుల కోవకు చెందిన వారనేకులు కాచుకొని ఉంటారు; అందుకని జానకిలాటి సమస్యలు ఆమెకు ఎదురవవు. తన నిశ్చయం తన కుటుంబంలో ఒక భూకంపాన్ని రేపుతుంది; తనను అందరూ నిందిస్తారు. ఐతే వారందరికీ తాను నచ్చచెప్పేందుకు ప్రయత్నించటం వృథా! ఆ దారుణ ఫలితాన్ని అనుభవించేందుకు సిద్ధపడే తీరాలి.

ఒక గొప్ప ఆదర్శాన్ని సాధించేందుకుగాను, తమ జీవితాల్ని బలి పెట్టిన అనేకమంది మహా పురుషులున్నారు. తాను మహాపురుషుడు కాకపోయినా, వారిని ఆదర్శంగా ఉంచుకోవటం, వారి అడుగుజాడల్లోనే నడవటం నేరం కాదుకదా! చివరకు తానొక బలిపశువైనా ఫర్వాలేదు. ఎందుకంటే తాను పడే భంగపాటు వెనుక తన నీడలో మేడ కట్టుకో గలిగిన ఒక మానవప్రాణి ఉండనే ఉంటుంది!

ఇలాటి అనేక ఆలోచనల తాలూకు నిశ్చయాలు మహా వృక్షాలై, ఊడల్ని లోతుకు దించుకుపోవటం జరిగింది కనుకనే, మహా వీరునివలె, గొప్ప ధైర్యంతో సముద్ర ప్రవాహాల సైతం ఎదురీదేందుకు తగిన మనోస్థయిర్యం చిక్కింది...

ఇంతలో జానకి వొచ్చింది. మొహమంతా వాడిపోయి ఉన్నది. తనను చూడగానే ఆమె తన స్థితి తెలియరాకుండా వ్యర్థప్రయత్నాలు చేసింది. కాని తనకు అసలు విషయం తెలుసు కనుక తాను తయారు చేసిన పథకంతో ముందుకు సాగాడు.

"జానకీ! నేను నిన్ను పెళ్ళాడా లనుకుంటున్నాను--" అన్నాడు.

ఆమెకు అర్థం కాలేదని ఆ శూన్య దృక్కులే చెప్పినయ్.

"ఔను జానకీ! నేను నిన్ను పెళ్ళాడుతాను!" అన్నాడు.

హఠాత్తుగా బుర్రలోకి మెరుపు ప్రవేశించినప్పుడు కలిగే సంచలనం లాటిది ఆమెలో పని చేసింది. తాను పట్టుకోకపోతే కింద పడిపొయ్యేదే!

ఆ షాక్ నుంచి తెమిలే లోగానే ఆమె కింకా నమ్మకం కలగలేనట్లుంది: 'ఏమయింది?' అన్నట్లుగా అతని మొహంలోకి చూసింది.

జరిగిందంతా చెప్పటం తనకు ఇష్టం లేదు. అందుకని "జానకీ! నిన్ను పెళ్ళాడేందుకు నిశ్చయించుకున్నాను. నీ అంగీకారమే తరువాయి--" అన్నాడు.

త్యాగం చేసేవారు యీ ప్రపంచంలో బహు కొద్దిమంది; కాని స్వీకరించనివారు ఎవరుంటారు కనుక?

ఒక నిమిషం వరకూ ఆమె జవాబివ్వ లేదు; నమ్మలేనిదాన్ని నమ్మి తీరేందుకు ఆమెకు వ్యవధి అవసరమైంది. ఆమె కూడా ఇలా ఎందుకు జరిగిందని అనలేదు. తనను కరుణించిన దేవతలు, అనుకోకుండానే వరాలిచ్చినట్లు భావించి ఉండాలి.

"నిజమేనా?" అంది.

"ప్రమాణం చేస్తున్నాను!" అన్నాడు రాజు.

క్షణంలో ఆమె ముఖంలో ఆనందరేఖ మెరిసి, మొహమంతా కమ్ముకుంది.

కళ్ళ ఎదుట తాను సృష్టించుకో గలిగిన నిజమైన మానవ జీవాన్ని తను చూడగలిగాడు. ఇంత తేలిగ్గా పరిష్కరించగల సమస్యలు సమాజంలో ఎంత సంచలనాన్ని రేపుతూన్నవో అర్థమైంది.

అంతలోనే ఆమె కంటి వెంట ఆనంద బాష్పాలు రాలినయ్. చప్పున పెళ్ళికూతురు పొందే అనుభూతులు - నునుసిగ్గు, కొత్త జీవితం తాలూకు తలపుల ఆనందం మొదలైనవి పొడసూపినవి. జానకి ఇంట్లోకి మాయమైంది.

ఆ రోజు ఆ కొంపలో ఒక పర్వదినం ప్రవేశించింది. అందరూ ఎంతో ఆనందంతో ఉన్నారు.

ఒక మహత్తర కార్యాన్ని సాధించినందుకు తనక్కూడా గర్వం కలిగింది. ఆత్మ తృప్తికి మించింది యీ ప్రపంచంలో మరొకటున్న దనలేని స్థితిలో పడ్డాడు.

ఇంత జరిగిన తర్వాత తను వెనక్కు వెళ్ళటమేమిటి? తనకు మతి పోలేదు. మతి ఉన్నది కనుకనే మానవుడుగా బతికి బైటపడ్డాడు. ప్రపంచమంతా మోసపోయి, తనను మోసగించు గాక! కాని తన అంతరాత్మ తననెన్నడూ మోసపుచ్చే ప్రయత్నాలు చేయదు!

## 2

నాటికి నేడు నాలుగేళ్ళ తర్వాత ఇక్కడ సముద్రపు టొడ్డున ఒంటరిగా కూర్చొని, జీవిత సింహావలోకనం చేసుకుంటుంటే, తనకు నిజంగానే మతి పోయి ఉండబట్టే యీ ఊబిలో ఇరుక్కున్నానని నమ్మవలసి వొస్తోంది.

ఈ ఆశయాలు - అచ్చులో, మెత్తని కాగితం మీద ఎంత అందంగా ఉంటవి! మాట్లాడేటప్పుడు వినేందుకు ఎంత మధురంగా ఉంటవి! చదివేప్పుడు వొళ్ళు జలదరించి, బుర్రలో మెరుపుల్ని మెరపించి, మనస్సును మెలిపెట్టి జీవిత ప్రవాహాన్నే వేరొక దిక్కుకు తప్పించే శక్తి వాటికున్నది!

ఐతే తీరా ఆచరణలోకి వొచ్చేప్పటికి ఆశయాల కన్నా మోసకారులు మరెవ రుంటారనిపిస్తోంది! ఆ మృదుత్వం వెనుక దాగిన కాఠిన్యం, ఆ అందం వెనుక ఉన్న భీకరత్వం, మాధుర్యాన్ని అడ్డుపెట్టుకున్న చేదు విషం మొదలైన వన్నీ అనుభవంలోకి వొచ్చినయ్!

త్యాగం చేసినవాడు తన స్వార్థాన్ని గూర్చి చింతపడటమంత బుద్ధి తక్కువ లేదు; కాని, ఆ త్యాగాన్ని స్వీకరించినవారు కూడా అందువల్ల సుఖపడనట్లయితే, వారికి నిరుపయోగంగానూ, అసంతృప్తికరంగానూ ఉన్నట్లయితే, ఆ త్యాగానికి విలువలేమిటి కనుక? తాను బలిపెట్టినదంతా వృథా ఐపోయిందని తెలుసుకోవటం ఎంత బాధాకరం!

ఆశయాలు చదివేందుకూ, వినేందుకూ, వాదించేందుకూ, వాగేందుకూ మాత్రమే అద్భుతమైనవేమో? ప్రపంచంలో మొదటినుంచీ మానవుడు వాగిన యీ ఆదర్శాలు ప్రతి యుగంలోనూ మహా పురుషులు ఉద్భవించి, మానవ జీవితాల్ని వెలుగొం దించేందుకుగాను యీ సమాజం, ప్రభుత్వం ఏర్పరిచిన కట్టడులూ, చట్టాలూ మొదలైనవాటిల్లో వందోవంతన్నా మానవుడు ఆచరించి వున్నట్లయితే, స్వర్గమనేదాన్ని నమ్మవలసిన అవసరమే ఉండేది కాదు; కళ్ళ ఎదుటనే ఆ స్వర్గం ఉండగా, ఇంకెక్కడో ఉన్నదని మోసపొయ్యేందుకు మానవుడు బుద్ధిహీనుడా?

మరి అలా జరగలేదు సరికదా--ఆశయాలు ఆశయాలుగానే ఉండి, జీవితాలు వాటి పలుకుబడులకు లొంగక, స్వార్థ చింతలకు లోనై, కొంతలో కొంత సుఖపడుతూన్నవి. తన వలెనే మరి కొంతమంది ఆశయాల కోసమై బలయేందుకు ఎందుకు సిద్ధపడలేదో యీనాడు బాగా అర్థమైంది. తనలాగా గుడ్డిగా నమ్మి సాగర ప్రవాహాల్లోకి పడిపోకుండా తమను తాము కాపాడుకున్నవారు, తెలివిగలవారు మాత్రమే కాదు; అదృష్టవంతులు కూడాను.

ఎప్పుడో, ఎక్కడో మహా తపస్వులుండేవారనీ, వారి నోటి మాటలు అతి శక్తివంతమైనవనీ, వారి శాపాలు కఠినంగా ఉండేవనీ, తప్పక అమలు జరిగేవనీ అనేక పురాణగాథలు విన్నప్పుడు, తాను నమ్మలేదు; కాని, యీనాడు కూడా అలాటి మహానుభావులున్నారని రుజూ ఐంది; లోకమంతా 'నీ గతి కుక్కల కెరుక!' అన్నప్పుడు తాను లెక్కచేయలేదు కాని, ఇప్పుడు వారి శాపాలు ఎంత నిశితమైనవో, గురి తప్పనివో బాగా అర్థమైంది. మునుల శాపాలకన్నా విరుగుడంటూ వుండేది కాని, యీ మానవుల శాపాలకు మరి తిరుగు కూడా లేదు! వీరి వాక్శుద్ధి వన్ వే ట్రాఫిక్ జాతిదేమో!

తలుచుకుంటే గుండె తరుక్కు పోతుంది. జానకి ఎంత మారిపోయింది! దుమ్ములో పడి దొర్లుతూన్న ఆమెను పైకి తీసి, ఆమె కూడా మానవమాత్రురాలేననీ, బతికే యోగ్యత ఆమెకూ ఉన్నదనీ తాను రుజూ చేసినప్పుడు ఆమె ఎంత ఆనందించింది! ఎంత కృతజ్ఞత చూపింది!

ఆ దురదృష్టవంతురాల్ని భరించేందుకు సిద్ధపడి, మిగతా బంధుమిత్రులందర్నీ వొదులుకుని, పూవులమ్మిన ఊళ్ళోనే కట్టెలమ్మలేక, యీ పట్టణంలో నానా అవస్థలూ పడి, నెలకు ఎనభై రూపాయల నౌఖరీ సాధించేందుకు తాతలు దిగొచ్చారు.

తాను భావించి నమ్మిన విలువలు వేరు; నిజంగా చెల్లించబడిన విలువలు వేరూను. ఐనప్పటికీ తాను నిరుత్సాహపడలేదు. తన ఆశయం చూపే కాంతితో ముందుకు సాగేందుకు ఉత్సాహపడ్డాడు. కాని తన కాళ్ళకు చుట్టుకొని, తనకు భారమైన జానకీ, తాను సుఖపడలేక, తనను సుఖ పెట్టలేకపోయింది.

కర్మ సిద్ధాంతాన్ని తానెప్పుడూ నమ్మలేదు. కాని ఇప్పు డీ పరిస్థితులు చూస్తుంటే కర్మ సిద్ధాంతం తప్ప, మరే సిద్ధాంతమూ అన్వయించకుండా ఉన్నది. శారదను పెళ్ళాడి, ఆ బంధుమిత్రుల అనురాగంతో హాయిగా బతకవలసిన తనకు యీ ఖర్మ ఏమిటి? ఈ ఒక్క ఆదర్శంకోసమని తాను ఏం త్యాగం చేశాడో, దాని విలువలేమిటో యీనాడే అర్థమౌతూన్నవి. సర్వస్వమూ చేయిజారిపొయ్యాక, ఏమనుకొని ఏం లాభం?

తనను మనసారా ప్రేమించిన శారదకు అన్యాయం చేశాడు: కని పెంచిన తల్లిదండ్రులకూ, కుటుంబానికీ అన్యాయం చేశాడు; జానకి ఒక్కతెకూ న్యాయాన్ని చేయాలని, యీ సమాజంలో తానొక్కడే ఆ పని చేయగలనని పొరబడ్డాడు.

చివరకు తనకు తాను చేసుకున్న అన్యాయాన్ని గూర్చి కూడా బాధపడటం లేదు; జానకన్నా సుఖపడి వుంటే తన ఆశయం అక్షరాలా నెరవేరినట్లే భావించి, తృప్తిపడేవాడు.

నడిసముద్రంలో మునగానాం, తేలానాం స్థితిలో ఉన్న వ్యక్తిని ఎలాగైనా రక్షించాలని పోయినప్పుడు, తాను మునిగిపోతాననే భయంతో, యీతగాడిని కదలనీకుండా పట్టుకొని వేళ్ళాడే వ్యక్తివలె జానకి తయారైంది. అందువల్ల ఆ యీతగాడితో పాటు, తాను కూడా మునిగిపోవాల్సి వొస్తుందనే అనుమానం కూడా, తెలివిగలదని తాను నమ్మిన జానకికి కలగకుండటం శోచనీయం!

నాలుగేళ్ళు! యీ నాలుగేళ్ళ జీవితంలోనూ నలభై ఏళ్ళ అనుభవాన్ని పొంది నట్లయింది. తనలోని ప్రతి సజీవశక్తి ఏదో విధంగా దెబ్బతిని మూలుగుతూనే వుంది.

తనకెంత పట్టుదలో ఇతరులక్కూడా తనంత పట్టుదలా వుంటుందనుకోలేదు. కొద్ది రోజులు పొయ్యాక తన తల్లిదండ్రులు తిరిగి తనను జానకితో సహా ఆహ్వానిస్తారని పొరబడ్డాడు! చిన్నప్పుడు అలిగి సాధించిన అనేక గొంతెమ్మ కోరికల్లాటివే, ఇదీ అనుకున్నాడు. కాని తల్లిదండ్రులు బతికి వుండీ, శాశ్వతంగా తనకు దూరమై పోతారనుకోలేదు.

బహుశా జానకి కూడా తనవలెనే పొరబడివుంటుందని ఇప్పుడు అర్థమౌతోంది. పెద్దింటి కోడలవాలని ఆమె వాంఛించటం సహజమే! కాని ఏ మానవుని వాంఛలన్నీ తీరినయ్ కనుక?

ఉన్నంతలో తృప్తిపడుతూ ఆత్మాభిమానాన్ని కాపాడుకునేందుకు ఆమె తనతోపాటు ఎందుకు ప్రయత్నించదు? తన కష్టసుఖాలను చూస్తూ కూడా ఆమె వాటిని ఎందుకు

పంచుకోదు? జీవితపుటంతస్తులు పెంచుకో దగినవే కాని, అనుకున్నవి అనుకున్నట్లు సాగుతవా?

చిత్రమేమిటంటే అతి బీదదైన జానకి తనదవగానే, తన కుటుంబపు టాస్తిపాస్తుల్లో భాగం లేనప్పుడు, ఇక జానకి ఎవరు కనుక? మొదట్లో ఆ పొరపాటు పడినా, క్రమంగా ఆమె తెలుసుకో గలుగుతుందని తాను సరిపెట్టుకున్నాడు; కాని, అలా జరగలేదు.

తాను సర్వసమర్థుడనీ, తనను భూమి మీద నడవనీడనీ ఆమె పొరబడింది. నిజానికి తాను అలా చేయాలనే అనుకున్నాడు కాని, జేబు బరువుతో తప్ప సాధించలేని ఆ ఆనందం తనకు దూరమైంది. ఇది తాను చేతులారా చేసుకున్నందుకు పశ్చాత్తాపపడలేదు; కాని, చూస్తూ కూడా జానకి తననొక అసమర్థుని వలె, నిష్ప్రయోజకుని వలె లెక్క కడుతోందంటే, తన మనస్సు ఎంత క్షోభిస్తోందో ఆమె గ్రహించటంలేదు; కనీసం అలాటి ఆలోచన ఆమెలో ప్రవేశించటంలేదు.

ఇంతకన్నా దారుణం ఉంటుందా? పుట్టింట్లోకన్నా ఇక్కడ తక్కువేం జరిగింది కనుక? పస్తులు పడుకోవలసిన అవసరం కూడా ఇక్కడ లేదే!

విలాసయుత జీవితం వైపు మనసు మళ్ళుతుంది--నిజమే! కాని అది సాధ్యమవ్వాలంటే ఏం చేయాలి? పుట్టిననాటినుంచీ బీదరిక బాధల్ని అనుభవించిన జానకి ఇప్పుడైనా ఎంతో సుఖపడాలని ఆశించి ఉండొచ్చు. ఆమెకు లేకుండా తానేం సుఖపడుతున్నాడు కనుక? ఇవన్నీ చెప్పి ఆమెకు అర్థమయేట్లు చేయవలసిన విషయాలా? తనంతట తాను గ్రహించుకో దెందుకనీ?

మొదట్లో 'పాపం! అమాయకురాలు!' అని సరిపెట్టుకున్నాడు కాని, రాను రాను ఆమె అనేక సందర్భాలలో ఇష్టపూర్వకంగా, కావాలనే తనను గాయపరుస్తోందని నమ్మక తప్పలేదు.

"వెధవ సంసారం! పండక్కన్నా కొత్త చీర లేదు!" అని ఏడుస్తూ కూర్చుంటుంది.

ఆ కొత్త బట్టలు కట్టాలని తనకు మాత్రం లేదా? ఆమెకు కొత్త చీర కొనకుండా, తనేమన్నా బట్టలు కొనుక్కున్నాడా? తన చిరిగిన చొక్కా కనిపించకుండా కోటు తొడుక్కుంటున్న సంగతి, బైటి ప్రపంచానికి తెలియకపోతే తెలియకపోవచ్చు కాని, రోజూ చూస్తున్న జానకికి తెలియదా? తెలిసి వుండే ఆమె బాధపడి, తనను బాధపెట్టటం దేనికి? తన ఆర్జనంతా ఆమెకే ఇస్తున్నాడు కదా, అందులో కొత్త బట్టలకు ఏమన్నా మిగులుతుంది కనుకనా?

మరి కొన్నిసార్లు "మీ నాన్నగారికి పైకం పంపమని రాయకూడదూ?" అంటుంది.

తనేం జవాబు చెపుతాడు? బీదరికపు బాధకన్నా, తాను బీదవాడని ప్రపంచానికి తెలియటమే బాధాకరమైన విషయమని ఆమె ఎందుకనుకోదు?

ఏ పరిస్థితుల్లో తాను కుటుంబాన్ని విడనాడాడో, ఎవరికోసం యీ పని చేశాడో కూడా ఆమె గ్రహించదు; తాను ఎంత త్యాగం చేశాడో దాన్ని స్వీకరించిన ఆమెకే అర్థంగాకపోతే, ఇతరులకు ఏం అర్థమౌతుంది కనుక?

యాచన--యీనాడు తన కుటుంబాన్ని సహాయం అడగటానికి అంతకన్న మరొక పదం లేదు - ఆత్మాభిమానాన్ని కాపాడుకుంటూ బతకగలగటం ఎంత గొప్పదో ఆమె తలపోయదు! తా నేమని తన మనస్సులోని క్షోభను వెల్లడించగలడు?

"ఈ పాడు సంసారం చేయటంకన్న ఉరిపోసుకొని చావటం మేలు!" అన్నదామె అనేకసార్లు.

సంసారంలోని పాడు తనక్కూడా నషాళానికంటింది కాని, ఆమె వలె ఉరి పోసుకొని చావగలిగిన సాహసం తనకు లేదు. ఎలాగైనా సరే, చివరి రక్త కణం వరకూ యీ సమాజంతో పోరాటాన్ని కొనసాగించ వలసిందే!

ఐతే ఉరిపోసుకొని చావటం మేలని మాటవరసకైతే జానకి అన్నది కాని, ఆమె ఆ పని ఎందుకు చేయదు? అంత సులభంగా యీ సమస్యల్ని పరిష్కరించే మార్గం వుండగా, యీ వెధవ బతుకు మీద మమకారం దేనికి? తాను అడ్డుపడకుంటే ఆనాడే యీ జానకి ఆత్మహత్య చేసుకునేది కదా! మరి యీనాడు ఆ నిరాశలాటిది, ఆమెను ఆత్మ హత్యకు ప్రోత్సహించటం లేదా? ఆనాడు జానకి చనిపోయి వుంటే ఆమె సుఖపడేదో లేదో దేవుడి కెరుక కాని తాను మాత్రం యీ నికృష్ట జీవితాన్ని వరించవలసి వొచ్చేది కాదు కదా!

తాను జానకిని ఎంతవరకూ సహించాలో అంతవరకూ సహించాడు. కేవలం ఆమె బీదరికం వల్లనే యీ విధంగా తయారైందనుకునేందుకు వీల్లేదు. మనిషితత్వంలో కలిగిన మార్పులు, రోజూ కళ్ళ ఎదుట ఎంతోమంది ఆనందంగా, హాయిగా, విలాసంగా జీవిస్తూన్న సంఘటనలు ఆమెను మైమరపించి వుంటవి. తనకు చిక్కని ఆనందం ఎంతోమందికి చిక్కిందని ఆమె ఈర్ష్యపడి, దీనికంతకూ తన భర్తే కారణమని బాధపడుతోంది. విలాసాలను తన బాధ్యతలకు అంటగట్టి, తనను కొరగానివాణ్నిగా చూస్తోంది.

కాని యీ మహాపట్టణంలో కనీసం సగంమంది వొంటిపూట భోజనంతోనే కాలం గడుపుతూన్న సంగతి కూడా ఆమెకు తెలిసి వుండాలి. వారికన్న తానెన్నో రెట్లు అదృష్టవంతురాలని ఆమె ఎందుకు తృప్తి పడదు? తనకన్న అధికుల్ని చూసి బాధపడినట్లే, అల్పుల్ని చూసి సంతోషించి వుండాలి. తనను చూసి కూడా అనేకమంది ఈర్ష్యపడుతున్నారని తలపోయదు. జానకి మొండి మనస్తత్వం తనకు కొద్దిరోజుల్లోనే బాగా అర్థమైంది.

తను ఎంత బాధపడకుంటే - యీనాడు సహజంగా కానీ, ఆత్మహత్య ద్వారా కానీ యీ జీవితాన్ని చాలించమని ఆమెకు చెప్పలేదు కాని, చాలిస్తే మాత్రం దుఃఖపడదు! చివరకు తాను ప్రాణదానం చేసిన కృతజ్ఞతన్నా ఆమెకు లేదు. కృతజ్ఞతంటే మనిషికన్నా కుక్క మేలు రకం జంతువనిపిస్తుంది!

ఇంటికి వెళ్ళటమంటేనే భయం! బరువైన జీవితాన్ని లాగటమే కష్టం; కాని ఇన్నాళ్ళు అలవాటయ్యాక, గానుగెద్దుల జీవితం అలవడిపోయింది. కాని ఆ గానుగెద్దులే కాస్త ఆగి ఆలోచించినట్లయితే, పని చేయలేవు; అవి ఆలోచించనూ లేవు; అందుకు తగిన అవకాశం, వ్యవధీ వాటికి చిక్కవు.

కనీసం తానిదంతా ఆలోచించలేని దద్దమ్మగా వున్నా యీ బాధ వుండేది కాదు. కుళ్ళును తవ్వుకుంటే దుర్గంధం వ్యాపించటం మినహాగా జరిగేదేముంటుంది? బతుకు భారం కన్నా, అది భారమని మాటి మాటికీ జ్ఞాపకం చేస్తూండటం వల్ల ఆ పుండును కెలుకుతూనే వుండటం జరుగుతోంది. అందుకనే కొంప ఒక నరక సాదృశమైంది!

వాద ప్రతివాదాల్తో తేలే విషయాలా ఇవి! అందుకనే ఆమె ఎన్ని మాటలన్నా తాను విని భరిస్తూండటం అలవరుచుకున్నాడు. కాని మనిషి సహనాన్ని పరీక్షకు పెడితే, దానికీ ఒక అంతు వుంటుందనే సంగతి త్వరలోనే బైటపడుతుంది. తీరా ఆ అగ్నిపర్వతం పగిలితే ఆ లావాల వేడిలో చుట్టూ వున్న వాతావరణ మంతా భస్మీభూతమౌతోంది; అప్పుడు విచారించి ఏం లాభం?

ఎలాగైనా జానకిని సుఖపెట్టాలనే తాను సర్వవిధాలా ప్రయత్నిస్తున్నాడు. యీ నాటికీ ఆ వుద్దేశ్యం తనకున్నది. తాను లొంగుతాడు. ఎలాగైనా సరే ఆ ఆదర్శాన్ని సాధించేందుకే నడుం కట్టాడు తాను. సాగర మధ్యంలో వెధవ యీత అనుకోవటం వల్ల ప్రయోజనం ఏముంటుంది? వొడ్డుకు జేరాక యీత ప్రమాదకరమైన దనుకోవటం వేరు!

తనను అధికునిగా ఆమె చూడటం లేదని బాధపడలేదు. కాని అల్పుడిగా ఎందుకు భావిస్తుంది? తనను ఉద్ధరించినవాడుగా ఎందుకనుకోదు? కనీసం తనను యథాతథంగా ఎందుకు చూడదు? తనంత పనికిరానివాడా? జానకి ప్రణయాన్ని కూడా తాను యాచించటం లేదు. ఆమె సానుభూతి కూడా తనకు దక్కనప్పుడు, తాను పొరబడ్డానని అనుకోక తప్పటం లేదు.

ఇలా మరి కొన్నాళ్ళు సాగితే తనకు పిచ్చెక్కుతుంది. తన మీద తనకే అసహ్యం వేస్తోంది. కాని, తనను తాను విసర్జించుకోలేడు కనుక భరిస్తున్నాడు. మరో దారి లేనప్పుడు ఉన్న దారినే బాగుచేసుకోవాలి, లేదా సరిపెట్టుకోవాలి.

జానకి– తనకు, చేదోడు వాదోడుగా వుండవలసిన జానకి కనీసం తనతోపాటే జీవితాన్ని భరించవలసిన జానకికి తాను వెగటైనాడు. ఇంతకన్న అన్యాయం, దారుణం

ఇంకేం వుంటయ్? కృతజ్ఞత వేరొక రూపంలో ఇంతకన్న భీకరంగా ప్రత్యక్ష మవుతుందంటే తాను నమ్మలేదు.

ఆమె తనను భర్తగా గౌరవించి పూజించకున్నా, కనీసం సంరక్షకుడిగా నన్నా చూడటంలేదు. తనెంత బాధపడుతున్నాడో ఆమె గమనించదు! తాను కోరిన సౌఖ్యాన్ని చేకూర్చలేని తన అసమర్థతనే ఎత్తి పొడుస్తుంది.

"నాలుగేళ్ళు సంపాయించినా మెడలో చిన్నమెత్తు బంగారమన్నా లేదు!" అని తనను తాను అసహ్యించుకున్నట్లుగా, ఎన్నోసార్లు అన్నది.

అన్నం తినేందుకు అల్యూమినియం బొచ్చెలు మాత్రమే కొనుక్కో గలిగిన సంసారంలో, బంగారం లేదని ఏడ్చే ఇల్లాలిని ఏమనాలి?

జానకి మనస్తత్వం యీ విధంగా మారేందుకు ఒక పెద్ద కారణం వుండి వుండాలని ఎంతో ఆలోచించి చివరకు కనుక్కొన్నాడు; తన కోసమని పరిగెత్తు కొచ్చినందుకుగాను, తాను చాలా గొప్పదనే భావం, తనంటే పడిఛస్తున్నాడు కనుకనే, తన విలువ చాలా గొప్పదనే నమ్మకం ఆమెకు కలిగి వుండాలి. ఐతే ఆమెకా గొప్పతనాన్నిచ్చిన తాను ఎంతో అల్పుడైపోయాడు. లేదా తాను ఆమె కోర్కెలన్నిటినీ తీర్చగల సర్వసమర్థుడని ఆమె నమ్మింది; అంత విలువ తన కివ్వబట్టే నిత్య జీవితంలో ఆ గొప్పతనాన్ని నిలబెట్టుకోనందువల్ల ఆమె దృష్టిలో తాను దిగజారిపోయాడు. అది తన తప్పని ఆమె అనుకుంటే ఆ బాధ్యత తనదా?

రాత్రి తొమ్మిదయింది; చుట్టూ పొగమంచు వేళ్ళాడుతోంది. ఇక్కడ యీ చలిలో ఎంతసేపు ఇలా ఆలోచిస్తూ కూర్చున్నప్పటికీ, జానకి కొరకరాని కొయ్యవలెనే వుండిపోతుంది. ఇన్నాళ్ళూ కాలచక్రం యీ సమస్యను తీర్చగలదని నమ్మాడు; ఇప్పుడు ఆ నమ్మకం కూడా లేదు. యీ వున్న సమస్యలకు తోడు, నిమోనియా కూడా వెంటపడితే, ఇక చెప్పవలసింది లేదు.

గుడ్డలకంటుకున్న ఇసుకను దులుపుకొని, బరువైన కాళ్ళను యీడ్చుకుంటూ ఇంటికి బయలుదేరాడు రాజు.

## 3

సినిమాకు తీసుకెళ్ళమని జానకి ఎన్నోసార్లు అడగ్గా, యీనాడు కుదిరింది. ఎలాగైనా ఆమె మనసు మార్చాలనే తనూ శతవిధాల ప్రయత్నిస్తున్నాడు; ఆమె అర్థం చేసుకోవటం లేదు కానీ, తా నామెను సుఖ పెట్టాలనే చూస్తున్నాడు. కానీ లేమి కారణంగా ప్రతీది ఆమెను తప్పు అభిప్రాయాల వైపే మళ్ళిస్తోంది.

సినిమాకన్నా, సినిమాకు వొచ్చిన మనుషులూ, వారి హావభావాలూ, ఠీవులే జానకిని ఎక్కువగా ఆకర్షించినవి.

"ఆ అమ్మాయి కట్టుకున్న సిల్కు చీరె ఎంత బావుందో!" అనీ, "ఆమె మెళ్ళో మల్లెమొగ్గల నెక్లెస్ చూడండి ఎంత అందంగా వుందో!" అనీ, అనేకుల దుస్తుల్నీ, ఆభరణాల్నీ ఆమె మెచ్చుకొంటూ, తన దృష్టిని కూడా అటే లాగింది.

మానవుడు ఒకదానితో మరొకదాన్ని పోల్చుకొని, భేదాన్ని బట్టే విలువల్ని నిర్ణయించుకునేందుకూ, దాని ద్వారానే ఆనందాన్నీ, దుఃఖాన్నీ పొందేందుకూ, మొదటినుంచీ అలవడ్డాడు కనుకనే, జీవితం ఇంత భారంగా వుంది. తనలాటి ఆలోచనలు జానకికి కలగకుండటమే ఇప్పుడు యీ దాంపత్యంలో వొచ్చిపడిన పెద్ద ఇబ్బంది!

చిత్రం మంచిదే ఐనా, జానకిని సంతోషపెట్టలేదు. మనసులో లేని ఆనందం బైట ప్రపంచం నుంచి రావటం కష్టం; మనసులో అదివరకే గూడుకట్టుకొని వున్న ఆనందాన్ని బైటి వాతావరణం బైటికి లాగగలుగుతుందేమో?

తీరా సినిమా ఐపొయ్యాక బైట జోరున వర్షం. కార్లున్నవారూ, టాక్సీలలో వెళ్ళగలిగినవారూ, ఇతర వాహనాలను భరించగలిగినవారూ, కొద్దిమంది ఇళ్ళకు వెళ్ళారు. తమతోపాటే చాలామంది, వానకు భయపడి హాలు వరండాలో నిలబడి వున్నారు. ఎంతకూ వాన తగ్గే సూచనలు కనిపించ లేదు.

"నిలబడితే ఇంతే! ఎలాగైనా బస్ స్టాప్‌కు జేరుదాం జానకీ!" అన్నాడు రాజు.

"ఎట్లా? తడిసిపోమూ?" అంది జానకి.

"తడుస్తే తడుస్తాం... ఇంటికి వెళ్ళి బట్టలు మార్చుకోవచ్చు. వానకు భయపడి ఇక్కడుంటే, చివరకు బస్సు కూడా దొరకదు" అన్నాడు రాజు.

ఆమె విసుక్కుంది; కాని గత్యంతరం లేక, ఆ వానలోనే బయలుదేరింది. బస్ స్టాప్‌కు వొచ్చేలోగా ఇద్దరూ పూర్తిగా తడిసిపొయ్యారు.

"వెధవది గొడుగన్నా లేదు!" అని గొణుక్కుందామె. ఇంకా నయం 'కారన్నా లేదు!' అననందుకు రాజు సంతోషపడ్డాడు!

బస్‌స్టాప్‌లో తమవలెనే అనేకమంది నిలబడి వున్నారు. శరవేగంతో వెళ్ళే కార్లు, మురికినీళ్ళను మొహాలకు గురిచూసి చల్లి మరీ పోతూన్నవి. చలికి వొణుకుతూ జానకి నిలబడింది. తన స్థితీ అలాగే వున్నా, రాజు యీ బాధల్ని భరించేందుకు బాగా అలవడబట్టి అంతగా కష్టపడటంలేదు.

"పోనీ బేబీ టాక్సీ పిలవండి!" అంది జానకి మెల్లిగా.

రాజు ఆమె వైపు ఉరిమి చూశాడు. డబ్బుంటే ఈ స్థితిలో ఇక్కడ నిలబడి వుండేవాళ్ళమని అనుకుంటూన్న ఆమె అల్పబుద్ధిని ఏమనాలో అతనికి అర్థం కాలేదు.

"వెధవ... బతుకులు!" అని ఆమె వినపడీ వినపడనట్లు గొణుక్కుంది. రాజు ఇదంతా గమనించనట్లే ఊరుకొని బస్సుకోసం ఎదురు తెన్నులు చూస్తున్నాడు.

ఇరవై నిమిషాలు గడిచి వుంటుంది. చాలా బస్సులైతే వొచ్చి, చాలా మందిని తీసుకొని వెళ్ళినయ్. కాని తమకు కావలసిన బస్సు మాత్రం ఇంకా రాలేదు. తమతోపాటు మరికొద్దిమంది మాత్రమే నిలబడిపొయ్యారు.

అసలు బస్సంటూ వొస్తుందో రాదో కూడా తెలియటం లేదు; ఒక పక్క కుండ పోతగా వాన పడుతోంది. వెధవ సినిమాకు రాకపోయినా బాగుండు ననే భావం రాజులోనూ, జానకిలోనూ కూడా కలిగింది; వారిద్దరిలోనూ అభిప్రాయ భేదం రాకుండా ఉండటంలో ఇదే మొదటిది!

ఒక పెద్ద స్టీమరంత కారు చాలా బరువుగా అల్లంత దూరంలో ఆగింది. బ్రేకులు వేసిన చప్పుడుకు ఏదో ప్రమాదం జరిగి వుండాలని ఆ చుట్టుపట్ల వున్నవాళ్ళందరూ అటే చూశారు. కాని అలాటిదేమీ జరగలేదని తెలుసుకొని కొంతవరకూ నిరాశపడ్డారు కూడానేమో?

కారులోంచి యూనిఫారం వేసుకున్న డ్రైవర్ దిగాడు. చేతిలోని గొడుగు తెరుచుకొని రాజు దగ్గరికి వొచ్చి సలాం కొట్టాడు. రాజు ఆశ్చర్యపడ్డాడు! ఇతనెవరో తెలియలేదు. ఒకవేళ తననింకెవరన్నా అనుకున్నాడేమోననే అనుమానం కలిగింది. ప్రశ్నార్థకంగా అతని వైపు చూశాడు.

"తమను పిలుస్తున్నారు!" అన్నాడా డ్రైవర్.

"ఎవరూ?" అన్నాడు రాజు; ఆఫీసర్‌కు కారున్నది కాని, అది చాలా చిన్నదే కాకుండా, పెట్రోలు మీదనే గాక, నెట్టినా నడిచేది. ఇలాటిది మాత్రం కాదు!

"అమ్మగారు!" అన్నాడు డ్రైవర్.

ఏ అమ్మగారో రాజుకు తెలియలేదు. జానకి కూడా ఆశ్చర్యపోతోంది. తన భర్తకోసమై అంత పెద్ద కారు ఆగినప్పుడే ఆమె ఎంతో సంతోషపడింది. కాని యీ అమ్మగారెవరూ?

ఇలా మాట్లాడినందువల్ల ఏం తేలుతుంది కనుక?

"జానకీ! ఎవరో కనుక్కొస్తాను... ఇక్కడే వుండు--" అని డ్రైవర్ తెచ్చిన గొడుగులో బయలుదేరాడు.

కారు దగ్గరికి రాగానే "ఏం బావా! బాగున్నావా?" అందొక కోకిల కంఠం!

చప్పున గుర్తు పట్టలేకపొయ్యాడు.

"నేను బావా! శారదను!" అందామె.

శారద! చిన్నతనంలో తనతో కలిసి ఆట పాటలాడిన శారద! ఎంత మారిపోయింది! ఎంత అందంగా, నాజూగ్గా నవనాగరికంగా వుంది! పోనీలే. అంతస్తులో అంత భేదం వున్నా ఆమె తనను గుర్తించి పలకరించింది. అదే పదివేలు!

"బైట నిలబడ్డావేం బావా! లోపలికి రా" అందామె. రాజు షాక్ నుంచి తేరుకున్నాడు.

"నా భార్య వుంది - శారదా!"

"అలాగా! ఆమెను కూడా తీసుకొని రా బావా! మా ఇంటికి వెళ్దాం..." అందామె.

"ఎడ్రసివ్వు శారదా! ఇంకోనాడొస్తాను. బట్టలన్నీ తడిసి పోయినయ్...." అన్నాడు రాజు.

"బట్టలు నేనిస్తాలే బావా! అక్కయ్యను కూడా చూసినట్లవుతుంది... త్వరగా తీసుకొని రా బావా!"

"శారదా! ఇంకోనాడు --"

'వీల్లేదు... ఇప్పుడే రావాలి..." అందామె అధికార స్వరంతో.

మారు మాట్లాడలేక, గొడుగు తీసుకొని వెళ్ళి జానకిని పిలుచుకొచ్చాడు రాజు.

"మా మేనమామ కూతురు శారద ... మనను తన యింటికి రమ్మని బలవంతపెడుతోంది.... ఎదురు చెప్పే సావకాశం లేదు!" అని జానకిని దారిలోనే హెచ్చరించాడు.

కారు దగ్గిరికి రాగానే "ఈమె జానకి--" అని పరిచయం చేశాడు.

"నమస్కారం అక్కగారూ! రండి... తడిసిపొయ్యారే! ఫర్వాలేదు. ఇలా కూర్చోండి-" అని, శారద ఎంతో ఆపేక్షతో జానకిని తన పక్కనే కూర్చోబెట్టుకుంది.

ప్రతినమస్కారం చేసేందుక్కూడా జానకికి నోట మాట రాలేదు. దురదృష్టం తన్నిన తన్నుకు, అదృష్ట దేవత వొడిలో పడగా కలిగిన ఆశ్చర్యం ఆమె సర్వశక్తుల్నీ కట్టిపారేసింది.

రాజు ముందు సీటులో ఎక్కాడు.

"ఇంటికి పోనీ" అంది శారద.

తడి నేలను రాచుకుంటూ, మెత్తగా దొళ్ళిపోయింది కారు. కారులో కూర్చొని చూస్తే పట్టణం ఎంత అందమైనదో, మెరిసే లైట్లు పడి రోడ్డు ఎలా తళ తళలాడుతూ అద్దంమీదనే జారిపోతూన్నట్లున్నదో, జానకి మొదటిసారి తెలుసుకుంది.

మాట్లాడేందుకు ఆమెకేమీ తోచలేదు. ఈ కథకు సంబంధించిన మూడు పాత్రలూ తమ తమ ఆలోచనల్లో లీనమైపోయినవి.

పెద్ద బంగళాలోకి వొచ్చి కారు ఆగింది. కాపలావాడొచ్చి సలాం కొట్టి కారు తలుపులు తెరిచి ఒక పక్కకు వొదిగి నిలబడ్డాడు.

ఎక్కడో సినిమాల్లోనూ, కథల్లోనూ, కలల్లోనూ చూసే యీ రకం దృశ్యాలు ప్రపంచంలో నిజంగానే వున్నవనే నమ్మకం ఇప్పుడు జానకికి కలిగింది.

"దిగండి అక్కయ్యా!" అంది శారద.

ఇంతకుముందు గమనించలేదు కాని, శారద తనను నిజంగా అక్కగానే భావించటమే గాక, ఎంతో ఆపేక్షతో మాట్లాడుతోంది. శిథిలావస్థలో వున్న తన పుట్టినింటిలోనివారు కూడా ఇంత ఆప్యాయంగా తనను పలకరించి వుండలేదు.

దంపతులిద్దర్నీ వెంటపెట్టుకొని శారద ఇంట్లో ప్రవేశించింది. విశాలమైన హాలులో దేదీప్యమానంగా వెలిగే విద్యుద్దీపాల కాంతిలో అక్కడి ఫర్నిచరంతా మెరిసిపోతోంది. ఒక్కసారే ఆ దృశ్యాన్ని చూస్తే భరించలేనని కాబోలు, జానకి అలాగే ఆశ్చర్యంతో మెల్లిమెల్లిగా నలుదిక్కులూ చూసింది. హాలులో నుంచి, వట వృక్ష శాఖలల్లే, ఎన్నో గదుల్లోకి ద్వారాలున్నవి. జానకి నేలమీద మేకుల్తో దింపేసినట్లు కదలకుండా నిలబడి ఉంది.

"రండి అక్కయ్యా! బట్టలు మార్చుకుందురుగాని--" అన్నది శారద.

"ఈ బట్టలే చాలు శారదా!" అన్నాడు రాజు.

"ఆ తడిబట్టల్తో కూర్చుంటే మా ఫర్నిచరంతా పాడౌతుంది బావా!--అందుకని... అరేయ్! సుబ్బడూ! ఆ బీరువాలో కొత్త పంచె, అయ్య గారి కొత్త చొక్కా వీరికివ్వరా! ముందు తుండుగుడ్డ ఇవ్వు...తలంతా తుడుచుకో బావా! జలుబుచేస్తుంది-" అని శారద జానకిని వెంటపెట్టుకొని ఒక గదిలోకి మాయమైంది.

పది నిమిషాలయ్యాక శారద జానకిని వెంటబెట్టుకొని హాల్లోకి వొచ్చింది. జానకి కట్టిన విలువైన చీరె, మొహమల్ జాకెట్టు ఇదివరకు ఆమె కన్న కలల తాలూకు వాస్తవం! దుస్తుల్తో పాటే మనిషి కూడా ఎంతో మారిపోయినట్లుంది. పూర్వం ఆమె ముఖాన్ని కప్పిన విషాద మేఘాలు పటాపంచలై, గొప్ప తృప్తి తాలూకు కాంతి మొహాన్ని ఆవరించింది. జానకి కూడా అందమైనదేనని రాజు మొట్టమొదటిసారిగా అనుకున్నాడు.

"చొక్కా చాలా వొదులైనట్లుంది బావా!" అంది శారద.

రాజు నవ్వి ఊరుకున్నాడు.

"అక్కయ్యకు జాకెట్టు కూడా చాలా వొదులుగానే వుంది!" అంది శారద. "లావు మనుషులం బావా!"

జానకి లోలోనే నవ్వుకుంది. ఎప్పుడో భారతంలో చదివిన మయసభ వర్ణనంతా ఆమెకు గుర్తు వొస్తోంది. దాదాపు మాట్లాడకుండానే తనలోని భావాలను సంబాళించుకోవటంలో జానకి నిమగ్నమైంది.

"బావా! చాలా చిక్కిపొయ్యావ్!" అంది శారద.

రాజు ముసి ముసి నవ్వులు నవ్వి వూరుకున్నాడు.

"ఏం చేస్తున్నావ్ బావా?"

తాను చేస్తున్న ఉద్యోగం చెప్పాడు.

"జీతమెంత?" అంది శారద.

"ఎనభయ్!"

జానకి మనస్సు చివుక్కుమన్నది. జీతం ఎనభయ్యే ఐనా, కనీసం ఏ నాలుగొందలో చెప్పి ఉండవలసిం దనుకుంది. కాని, తమ మొహాల మీదనే సంపాదనెంతో స్పష్టంగా, మానవులకు తెలిగ్గా అర్థమయ్యే భాషలన్నిటిలోనూ రాసివుండగా అబద్ధమాడి ప్రయోజనం ఏమిటి? అందులోనూ శారద దగ్గిరా బొంకవలసింది?... భర్త నిజమే చెప్పినందుకు మొదట్లో కష్టపడ్డా, మొదటిసారి అతను చేసిన పనిని జానకి లోలోన మెచ్చుకుంది.

"ఎనభయ్యా?" అంది శారద ఆశ్చర్యపడుతూ. "వెధవ జీతం! నీ కెందుకొచ్చిన వుద్యోగం బావా! ఏదన్నా వ్యాపారం చేసుకోరాదూ?"

రాజు ఏమని జవాబు చెప్పగలడు?

"నాకు తెలుసులే బావా! పెద్దవాడైనా మామయ్యకు మతి సరిగ్గా లేదేమో ననిపిస్తుంది. అనకూడదు కాని – లేకపోతే కన్న కొడుకును ఇలా అన్యాయం చేయటం ఏం సబబు? వెధవ పట్టుదలలవల్ల జీవితాలు నాశనమౌతున్నాయని కూడా తెలుసుకోలేకపోతే ఏం లాభం?" అంది శారద సానుభూతితో.

మనసారా ప్రేమించిన తనను విడనాడాననే బాధన్నా శారదలో లేనందుకు రాజు చాలా సంతోషపడ్డాడు. ఆ మాటలు విన్నాక జానకి కూడా , శారద విశాల హృదయాన్ని గ్రహించింది. ఇంకొకతె ఎవరిదాకానో దేనికి– తనైతే రాజు అనుభవిస్తున్న జీవితానికి, తగిన శిక్ష అనుభవిస్తున్నాడు లెమ్మని తృప్తిపడేది కదా!

"పోనీలే శారదా! ఏదో ఇలాగే రోజులు దొర్లించగలంకదా!" అన్నాడు రాజు, గాంభీర్యాన్ని ప్రకటించేందుకు ప్రయత్నిస్తూ.

"నీ సహనం నాకు తెలుసు బావా! ఒక గొప్ప ఆదర్శంకోసమని ఎంత త్యాగాన్ని చేశావో కూడా నాకు అర్థమైంది. మన బంధువులందరూ నిన్ను అపార్థం చేసుకున్నారు కాని, నువ్వు అక్కయ్యను పెళ్ళాడేందుకు నిశ్చయించావని విని నేను ఎంతో

సంతోషించాను. జీవితంలో ఒక్క సత్కార్యమన్నా చేయలేని స్థితిలో వున్న మా అందరికన్నా నీవు ఎంతో గొప్పవాడివి! దురదృష్టవశాత్తు బీదరికంలో పుట్టి, పెరిగిన జానకికి అండగా నిలిచేందుకు సిద్ధపడటం, మాటలు చెప్పినంత తేలికా? నీలాటి వాళ్ళు నూటికి ఒకరన్నా వుంటే ఈ సమాజం ఇలా వుండేదా బావా?" అందామె.

తాను చేసిన త్యాగాన్ని గూర్చి తాను ఎప్పుడూ గర్వపడలేదు. ఆ త్యాగానికి తాను తల్లడిల్లుతున్నాడనే విషయం శారదకు తెలియదు. అందుకనే యీ పొగడ్తలకు రాజు వొళ్ళు పులకరించలేదు.

కాని ఇవే మాటలు జానకి హృదయంలో బాకులల్లే గ్రుచ్చుకున్నవి. ఇన్నాళ్ళూ తాను రాజు చేసిన త్యాగాన్ని గ్రహించలేదు కాని, ఇప్పుడు తెలిసొస్తోంది.

ఇవాళ యీ బంగళాలో విలువైన దుస్తులు వేసుకొని హాయిగా కూర్చున్నదంటే, ఇదంతా తన భర్త పలుకుబడే కదా! తన భర్త ఎంత గొప్పవాడు కాకుంటే శారద అతనంటే చెవి కోసుకుంటుంది? ఎంత గౌరవంగా, గొప్పగా అతన్ని చూస్తోందో కనిపిస్తూనే ఉంది. శారదకు కనిపించే ఆ గొప్పతనంలో వందో వంతన్నా తానిదివరకు గ్రహించలేదంటే తన బుర్రలోని మరలు తుప్పుపట్టి వుండాలి.

"పోనీలే బావా! ఐందేమో ఐంది... నే నొక లక్ష రూపాయిలిస్తాను... నీ ఇష్టమొచ్చిన వ్యాపారం చెయ్. వ్యాపారంలో నష్టమొచ్చి, అంతా పోయినా నేను ఏమీ అనను-- సరేనా?" అంది శారద.

లక్ష రూపాయలు! యీ మాటలు వినేప్పటికే జానకి కళ్ళు బైర్లు కమ్మినవి. చదువుకునేప్పుడు జీవితంలో అవసరం వున్నా, లేకున్నా కేవలం లెక్కల పరీక్ష కోసమని అంతంత పెద్ద పెద్దంకెలు వేయటం నేర్చుకున్నది కాని, నిత్య జీవితంలో లక్షల్ని గూర్చి మాట్లాడుతుండగా వినటం ఇప్పుడే!

నిజంగానే ఓ లక్ష రూపాయల కుప్ప కనక చూస్తే మూర్ఛపోవటం జరిగినా జరగొచ్చు, పాతాళంలోంచి ఒకానొక శక్తి ఆకాశపుటంచులకు లాక్కుపోయినట్లయింది.

తన భర్తకు లక్ష రూపాయిలిచ్చేందుకు సిద్ధంగా వున్న యీ ధనికురాలు, ప్రేమించి నిరాకరించబడిన ద్వేషమన్నా లేకుండా, అనురాగంతో, సానుభూతితో మాట్లాడు తోందంటే - వ్యక్తుల విలువల్ని కట్టడంలో మనుషులు ఎంత పొరబడుతూంటారో జానకికి మొట్టమొదటిసారి తెలిసొచ్చింది.

ఐతే తన హృదయంలో కలిగిన సంచలనంలాటిది, వికాసంలాటిది, భర్త మొహంలో కనిపించకుండటం జానకిని ఆశ్చర్యపెట్టింది. ఏ యావలో ఉండి శారద లక్ష రూపాయిలిస్తానన్నదో! ఎగబడి ఆ డబ్బు లాక్కు నేందుకు భర్త ముందుకు ఉరకడెందుకని? అవకాశాలు అనుకున్నప్పుడల్లా వస్తయ్యా? వొచ్చినప్పుడు వాటిని తృణీకరిస్తే, తరువాత పశ్చాత్తాపపడటమౌతుంది కదా!

రాజు అన్నాడు: "ఇప్పుడు హాయిగానే వున్నాం శారదా! నాకా వ్యాపారాలు ఏం తెలుసు కనుక?"

"ఆయన ఉన్నారుగా! ఆయనతో చెప్పి, ఆయన చేతనే చేయిస్తాను. నామమాత్రంగా నీవలా ఉండు బావా! నాకు తెలుసు నేనేదో ధర్మంగా ఇస్తున్నాననే బాధ నీకు కలుగుతుందనీ, అందువల్ల నీవు స్వీకరించవనీనూ, అందుకనే కేవలం సహాయంగా ఉండనీ బావా! ఈ డబ్బంతా నా స్వంతం బావా! గొప్ప త్యాగాలు చేసేందుకు మేము సామాన్యులం. కాని త్యాగమూర్తుల్ని గౌరవించి, కనీసం వారికి అండగా ఉండి, ఉడతాభక్తిని ప్రదర్శించేందుకన్నా అవకాశం ఇవ్వు!" అంది శారద, ప్రాధేయపడుతూన్నట్లు.

యాచకుడు ప్రాధేయపడటం తెలుసు కాని, ధర్మదాత ప్రాధేయపడటం ఎరగని జానకి దిమ్మెరపోతోంది. భర్త ఇంకా వెధవ బెట్లు చేస్తాడేం? చివరకు యీ లాభసాటి బేరాన్ని పోగొట్టుకోవటమే జరుగుతుందేమో ఖర్మ! మాట్లాడలేకపోయినా సరేనన్నట్లు భర్త తల ఆడిస్తాడేమో, తన రొట్టె విరిగి నేతిలో పడుతుంది కదానని జానకి ఆశగా, ఆతృతగా రాజు వైపు చూస్తోంది.

"శారదా! ఇంకోవిధంగా అనుకోకు. నాకు నిజంగా సహాయం కావలసి వచ్చినప్పుడు నీ దగ్గరికి తప్పకుండా వొస్తాను--"

రాజు యీ మాటలు అన్నాక, జానకి కుంచించుకొని పోయింది. నిజంగానే తన భర్తకు మతి పోయి వుండాలి. కనీసం ఆలోచిస్తానని అన్నా, తాను కాళ్ళా వేళ్ళాపడన్నా అతన్ని వొప్పించేందుకు ప్రయత్నించేది. చేతుల్లోకి వొచ్చినదాన్ని మట్టిపాలు చేశాడు!

"పోనీ బావా! ఆయనతో చెప్పి మంచి ఉద్యోగం ఇప్పిస్తాను... నీవు సుఖంగా వుంటే నాకదే చాలు!" అంది శారద.

"ఇప్పుడెందుకు శారదా! యీ వున్న ఉద్యోగం మొహం మొత్తినప్పుడు, మరో ఉద్యోగానికి ప్రయత్నిద్దాం!" అన్నాడు రాజు.

జానకి హృదయంలో పెద్ద గాడిపొయ్యి పొగలతో సెగలతో ప్రజ్వరిల్లుతోంది. సిద్ధాన్నాన్ని ఇష్టపూర్వకంగా కాలదన్నాడు! ఛీ! ఎంత నైచ్యం! కనీసం తన భార్య పడే బాధల కోసమన్నా ఆయన ఈ ఉద్యోగానికి ఒప్పుకున్నా బాగుండేది కదా! శారద అనే మాటలకు చలనమే లేకుండా మట్టిబొమ్మల్లే ఉండిపోతున్నాడు! ఈ సంఘటన కనీసం తన ఎదుట జరక్కపోయినా బాగుండేది.

"నీ మొండితనం, పట్టుదలా నాకు తెలుసు బావా!... పోనీలే...ఎన్నటికన్నా అవసరమైతే మాత్రం నన్ను మరిచిపోకు సరేనా?" అంది శారద. అంతలో కోపం, అంతలోనే ప్రసన్న వదనంతో!

రాజు నవ్వి "సరే శారదా!... ఇక మాకు శెలవిస్తావా?" అన్నాడు.

"అప్పుడేనా? ఆయన్ను పరిచయం చేద్దామంటే వూళ్ళో లేరు. రేపటిక్కాని రారు--ఐనా రేపు ఆదివారమేగా బావా! రేపు కూడా ఇక్కడే ఉండాలి--" అంది శారద.

"కాదులే శారదా! ఇంకోనాడు వొస్తాం కదా!" అన్నాడు రాజు.

శారద నిస్సహాయంగా హాలు నాలుగు వైపులా చూసింది. జానకికి లోలోపల మండిపోతోంది. సర్వనాశనమయాక 'ఇక వెళ్దామా?' అన్నట్లు భర్త ప్రశాంతంగా తనవైపు చూడటాన్ని ఆమె భరించలేకపోయింది. వేరొక దిక్కు చూస్తూనే కన్నీళ్ళొక్కటే తక్కువగా బాధపడుతోంది.

జానకి భుజం మీద తట్టుతూ శారద అంది: "మీరన్నా చెప్పండి అక్కయ్యా! ఒక్క రోజు మా ఇంట్లో ఉండరాదా?"

తాను చెప్పవలసింది చాలా వుంది. కాని మొండివాళ్ళకు, తన దృష్టిలో మానవులే కానివారికి ఏం చెప్పగలదు?

"మీకన్నా నా కెక్కువ పలుకుబడి వుందా?" అని తప్పించుకుంది జానకి.

శారద నిట్టూర్చి "పోనీలే బావా! భోజనం చేసి వెళ్ళండి" అంది.

"ఎందుకొచ్చిన శ్రమ శారదా! మరోనాడు తప్పకుండా వొస్తామన్నాను కదా!"

"బావా! ఇలా మారిపోయావేం?" అంది శారద. తాను పొందిన ఓటములన్నిటికీ, తనదే తప్పని సరిపెట్టుకునే ధోరణిలో.

"ఏం మారాను శారదా! నేను మాట్లాడేది తప్పుగా భావిస్తున్నావు కాని --ఇంకోనాడు రాకూడదా చెప్పు?" అన్నాడు రాజు.

భూకంపం వొచ్చినా లెక్క చేయని యీ మానవుడు - మానవుడా? జానకికి అర్థం కాలేదు. నాలుగేళ్ళు కాదు నలభై ఏళ్ళు కాపరం చేసినా, రాజును తాను అర్థం చేసుకోలేదు.

"అంతేలే బావా! మేమంతా ప్రాపంచిక సుఖాల కోసమే తహతహలాడే అల్పులం బావా!" అంది శారద కన్నీళ్ళతో.

"నే నలా భావించటంలేదు శారదా! నిన్ను బాధపెట్టినందుకు క్షమించు... భోజనం చేసే వెళ్తాం - సరేనా?" అన్నాడు రాజు.

శారదకు అమితానందమైంది. గాద్గదిక స్వరంతోనే సేవకులందర్నీ పేరు పేరునా పిలిచి భోజనాలకు ఏర్పాటుచేయమని పురమాయించింది.

ఇలాటి రాజభోజనాన్ని గూర్చి జానకి విన్నదేకాని రుచిచూడటం ఇదే మొదలు. నిజానికి భోజనంకన్నా శారద ఆదరణే మధురతమంగా వుంది. కాని కళ్ళముందు కనిపించి, చేతికందిన మహాదృష్టంలో యీ భోజనం ఒక్కటే నిజమైనదీ, మిగతాదంతా సముద్రపుటలలవలె కరిగిపోయిన కల మాత్రమే! అందినదానికన్న. పోగొట్టుకున్నది ఎన్నిరెట్లు అధికమో తలుచుకుంటే, తాను ఎంత క్షోభపడవలసివొచ్చిందో జానకికి అర్థమైంది.

భోజనాలయాక కూడా రేడియో వినిపిస్తూ ఆ మాటా యీ మాటా చెపుతూ, చాలాసేపటి వరకూ వారిద్దర్నీ శారద కూర్చోపెట్టింది.

"ఇక వెళ్తాం శారదా!" అన్నాడు రాజు.

"రాత్రికి ఇక్కడ ఉండరాదా బావా?" అన్నదామె ప్రార్థనాపూర్వకంగా.

"కాదులే శారదా! మరొకనాడు తప్పక వొస్తాం కదా!" అన్నాడు రాజు.

ఇక ఎదురు చెప్పేందుకేమీ శారదకు లేకపోయింది.

"పదండి.. నేనూ వొస్తాను. మీ ఇల్లు కూడా చూస్తాను" అంది శారద, కారు సిద్ధంగా ఉంచమని పురమాయిస్తూ.

"నీ వెందుకు శారదా! మేం వెళతాం కదా?" అన్నాడు రాజు.

"నేను రాకూడదా బావా?"

"ఎందుకు శ్రమ--?"

"నాకు లేని శ్రమ నీకు దేనికి బావా! ఎన్నాళ్ళకో కనిపించావు. ఆపేక్షలన్నీ గుండెల్లోంచి బైటికి రాకుండా ఉన్నాయ్. ఏం చెయ్యను?" అంది శారద విచారంగా.

రాజు నవ్వి వూరుకున్నాడు. బయలుదేరబొయ్యేముందు "శారదా! మా బట్టలు ఇప్పించవా?" అన్నాడు.

జానకికి లోలోపల మండిపోతోంది. ఇంతవరకూ భర్తవల్ల జీవితంలో జరిగిన లోపాలన్నీ ఒక యెత్తుగానూ, యీనాటి సంఘటనల్లో జరిగిన అన్యాయాలన్నీ ఒక ఎత్తుగానూ ఆమెకు తోచినయ్. వెధవ బట్టలు! ఆ బట్టల్ని కూడా మర్చిపోలేక పొయ్యాడంటే, ఈయనగారి సంస్కారం ఎలాటిదో ఆమె అంచనాలు కడుతోంది.

శారద నవ్వుతూ "నేనేం తీసుకోనులే బావా! ఇస్త్రీ చేయించి పంపుతాను... కాదు-- మళ్ళీ ఇక్కడి కొస్తానన్నావ్ కదా! కనీసం నీ బట్టల కోసమన్నా వస్తావనే ఆశతో వాటిని ఇక్కడే ఉంచుతాను బావా! అన్నట్టు అక్కయ్యా! మీ బట్టలే యీసారి మీకు పిలుపని గుర్తుంచుకో" అంది.

దారిలో ఎవ్వరూ మాట్లాడలేదు. ఆ ఇరుకు సందులోకి కారు రావటం నానా అవస్థ అయింది. కారులోంచి దిగగానే "ఇక వస్తాం శారదా!" అన్నాడు రాజు.

కాని శారద కూడా కారులోంచి దిగి "పద బావా! నేను కూడా లోపలికి వచ్చి కాస్సేపు కూర్చుంటాను; మీరు పిలవకపోయినా-- " అంది.

"నీవు రాకూడదని కాదు శారదా! మా ఇళ్ళూ వాకిళ్ళూ చూడదగినవి కావు - అంతే" అన్నాడు రాజు; ఇందాకటినుంచీ అతను తన బాధ వ్యక్తం గాకుండా భరించాడు గాని, యీ మాటలు అంటున్నప్పుడు మాత్రం అతని కంఠస్వరంలో దుఃఖతరంగాలు నాట్యం చేసినయ్!

ఓదార్చుతున్నట్లుగా భుజం మీద చేయి వేసి శారద అంది: "బావా! అందరు మనుషుల్లాగే కేవలం డబ్బుతోనే మనుషుల విలువల్ని నేను నిర్ణయించలేను. డబ్బుకు అందని, దానికి మించిన అనేక విలువలున్నవి. ఎట్లా బతుకుతున్నాం, ఎంత సౌఖ్యపడుతున్నాం, ఎవరికి హాని చేసయినా సరే ఎంత ఆనందించగలుగుతున్నామని కాదు బావా! మానవునివలె ఎంత అల్పంగా బతికినా, అదే నిజమైన బతుకు!"

కటిక చీకట్లోంచి ఈ మాటలు వెలువడినా, ఆ మాటల భావంలోని కాంతి పుంజాలు రాజుకు స్పష్టంగా కనిపిస్తున్నాయ్. ప్రపంచమంతా తనను విడనాడినా, తాను చేసిన ఒకానొక సత్కార్యాన్ని దూషించినా, అన్ని బాధల మధ్యా అనుసరించిన ఆ ఒక్క ఆదర్శాన్ని గూర్చి నిందించినా, చివరకు యీ శారద ఒక్కతన్నా తనను మెచ్చుకుంది. అదే పదివేలు! తిరిగి ఈ ఆవేశంతో మరొక దశాబ్దం ధైర్యంగా జీవితాన్ని ఎదుర్కొని సాధించగలడు.

ఇంతలో జానకి లాంతరు వెలిగించింది.

రాజు ముందుకు సాగుతూ "రా శారదా! జాగర్త - గుమ్మం తలకు తగులుతుందేమో?... ఇలా రా... మంచి కుర్చీ అన్నా లేదు--" అని చాప వేశాడు.

జానకి సిగ్గుపడుతూ, ఇంత గొప్ప అతిథికి చేయవలసిన మర్యాదలేమిటో తోచక వొణికిపోతోంది.

శారద ఇల్లంతా ఆ గుడ్డి దీపపు కాంతిలోనే కలియజూచి చాప మీద చతికిలపడింది. ఆమె చాలా అసహ్యించుకుంటుందనుకున్నాడు రాజు. జానకి కూడా అలాటి బాధే పడుతోంది.

కాని శారద మొహంలో గొప్ప గాంభీర్యం ప్రతిఫలించింది.

"బావా! మనిషివంటే నీవే! ఒక్క ఆదర్శం కోసమని నీ వేం త్యాగం చేశావో, ఎలా బతికేందుకు ఇష్టపూర్వకంగా సిద్ధపడ్డావో తెలుసుకో గలుగుతూంటే, నా గుండె చెరువవుతోంది. కాని నీలాటి మహాపురుషుల సందర్శనభాగ్యం లభించటమే కష్టం! బావా! నిన్నూ నీ సుగుణాలనూ పొగిడేందుకు నాకు మాటలు చాలవు... కాని నీవు నాకు బావవనే భావన ఎంతో గర్వకారణమౌతోంది. నీ ముందు మేమెంత అల్పులమో

అర్థమైంది బావా!" అని అతని పాదాలకు నమస్కరించింది. అప్పటికే ఆమె కన్నుల నుంచి జలజలా రాలుతూన్న వెచ్చని నీరు అతని పాదాల్ని తాకింది.

"ఛా!... ఏమిటి శారదా! ఎవరన్నా నవ్వుతారు!" అన్నాడు రాజు.

"నవ్వుతారా? నవ్వనీ బావా! యీ నవ్వేవాళ్ళ జీవితాలు శ్మశానంతో అంతమైతే, నీ లాటి మహానుభావుల జీవితాలు ఆ పైన కూడా చిరస్థాయిగా ఉండదగినవి. నవ్వినవాడు మనిషే కానప్పుడు, దాన్ని గూర్చిన పరిశీలన అనవసరం!" అందామె.

ఆ తరువాత ఎవ్వరూ మాట్లాడలేదు. భయంకరమైన నిశ్శబ్దం ఆ ఇంటి మూల మూలాల్లోనూ దాగివున్నట్లే తోచింది.

కొద్దిసేపయాక "ఇక నేను వొస్తాను బావా! నా జీవితాంతంవరకూ నేనిది గుర్తుంచుకుంటాను: యీ ప్రపంచమంతా అర్థం చేసుకోలేని ఒకానొక పురుషోత్తముణ్ని నేను కనుగొన్నాను... అతను నాకు చాలా దగ్గిర బంధువు కూడాను!" అని జానకి వైపు తిరిగి "వొస్తాను అక్కయ్యా! అదృష్టవంతురాలివి!" అని చర చరా బైటికి వెళ్ళిపోయింది.

బైట కారు కదిలిపోయిన శబ్దం వినిపించినా దంపతులిద్దరిలోనూ చలనం కలగలేదు.

జానకి సగానికి పైగా చచ్చింది... కాని, ఇంటి గుమ్మంలోకి వొచ్చి తొంగిచూసిన అదృష్టదేవత మొహాన పేడనీళ్ళు చల్లి, ఆమెను భయపెట్టి పారద్రోలిన తన భర్త మూర్ఖత్వాన్ని ఆమె మరచిపోలేదు. పొరపాటు జరిగిందనన్నా తన భర్త అంటే తప్ప, తన హృదయంలోని మంటలు శాంతించవు. భర్త ఎంత గొప్పవాడో తనకు తానై తెలుసుకోలేకపోయినా, శారద మాటల్ని బట్టి గ్రహించింది. కాని సుఖపడలేని ఆ గొప్పతనం వల్ల ప్రయోజనమేమిటి?

ఏమైనా తన భర్త మనోభావాల్ని తెలుసుకునేందుకు చాలా మృదువైన పద్ధతుల్నే ప్రయోగించాలని, జానకి మొట్టమొదటిసారి ప్రయత్నించింది.

పిల్లిలాగా అతని పక్కనే చేరి ఆప్యాయంగా "ఏమండీ అట్లా వున్నారు?" అంది.

ఈ మాట్లాడేది జానకేనా అనే అనుమానం కలిగిందతనికి. ఒక్కసారి మొహమెత్తి చూసి, నిశ్చయంగా తెలుసుకొని, విషాదాన్ని విదిలించుకున్నట్లు అటూ ఇటూ కదిలి అన్నాడు:

"ఎట్లా వున్నాను జానకీ?"

"ఏమో... కాని శారద ఎంత మంచిదండీ!" అంది మాట తప్పిస్తూ!

"మంచిదే!--" అన్నాడు.

"మనను ఎంత మర్యాద చేసింది!"

"ఔను--"

"ఆమె మనసు నవనీతం... కాని ఆమె మన నీ స్థితి నుంచి బైట పడేసేందుకు ఎంత ప్రయత్నించిందో మీరు చూశారుగా! లక్ష రూపాయలిచ్చి వ్యాపారం చేయమన్నప్పుడు కూడా నిరాకరించారు మీరు" అంది జానకి.

"ఐతే?" అన్నాడు రాజు కనుబొమలు చిట్లించి. జానకి సంభాషణను ఎటు తిప్పుతోందో అర్థమౌతోంది.

జానకికి మండిపోతోంది. మొండివాళ్ళ వ్యవహారమే ఇంతని సరిపెట్టుకోవాలని కూడా నిశ్చయించుకుంది.

"ఐతే నా?" అందామె, ఉద్రేకంతో మొహం జేవురింప జేసుకుంటూ. "మీకు మతి పోయింది! కాళ్ళ మీద పడిన అదృష్టాన్ని కాల తన్నుకున్నారు!"

ఇదివరకెప్పుడూ జానకి తనకు మతిపోయిందని అనలేదు. ప్రపంచమంతా ఆ మాట అన్నది. ఆ 'మతి'కి అర్థమేమిటో ఇప్పుడు చెప్పి తీరవలసిన పరిస్థితులు వొచ్చినవి.

"ఔను జానకీ! నాకు మతి పోయింది. మతి పోబట్టే చెవుల్లో గూళ్ళు కట్టుకొని అరుస్తున్నా వినిపించుకోకుండా నిన్ను పెళ్ళాడాను. యీనాడు శారద నాకు ఇస్తానన్న లక్ష రూపాయలూ, ఆమె ఆస్తిలోని ఒక భాగం మాత్రమే! కాని శారదనే పెళ్ళాడి వున్నట్లయితే, ఆమె ఆస్తితోపాటే, నా తండ్రి నుంచి కూడా బోలెడాస్తి వొచ్చేది... నే నిప్పుడదంతా రాలేదని విచార పడటం లేదు. యీ వున్నదానితోనే తృప్తిపడాలనే ప్రయత్నిస్తున్నాను... ఆత్మాభిమానమనేది నాకింకా చావలేదు. దాన్ని కాపాడుకునేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నాను. దానికి వెలకట్టి అమ్మలేను. ఎందుకంటే ఒక్కసారి ఆ విధంగా అమ్మితే, తిరిగి దాన్ని కొనుక్కోలేను... యీ డబ్బు మీదనే నాకు మమకారం ఉన్నట్లయితే అదింకా నా చేయి జారిపోలేదు. నిన్ను విడిచిపెట్టిన క్షణంలో మా నాన్న కావిలించుకొని ఇంటికి తీసుకెళ్తాడు. నేను పోగొట్టుకున్న బంధుమిత్రులందరూ మళ్ళీ నా చుట్టూ జేరుతారు, నన్ను కాలు కిందపెట్టనీకుండా భుజాలమీద ఎక్కించుకొని ఊరేగిస్తారు... కాని నేను పైకి యీ భోగాలన్నీ అనుభవించినా, మానవత్వానికి దూరమై పోతాను. కనుక అలాటి నీచానికి నేను ఒడికట్టలేను జానకీ!" అని, ఆ ఉద్రేకాన్ని భరించలేక దుఃఖంతో వొణికిపోసాగాడు.

జానకి పక్కనే పిడుగు పడినట్లయింది... నిజమే--తనను వొదిలేస్తే తన భర్త ఎంత సుఖపడగలడో ఆమెకు తెలిసొచ్చింది. తన భర్త చేసిన త్యాగమేమిటో, కేవలం తన కారణంగా అత నీ నరకాన్ని ఎలా భరిస్తున్నాడో కూడా ఆమెకు అర్థమైంది. ఈ యుగపురుషుని నీడలో బతికే అదృష్టం తనకు దక్కింది... 'అదృష్టవంతురాలివి!' అన్న శారద మాటల విలువ తెలిసింది. పుట్టుగుడ్డికి హఠాత్తుగా దృష్టి వొచ్చినప్పుడు యీ ప్రపంచం కలిగించే వెర్రి ఆనందంలాటిది ఆమెను ముంచెత్తింది.

జానకి రాజు కాళ్ళను కావలించుకుంది.

"క్షమించండి... నన్నొక మానవమాత్రురాలిగా చేసిన మీకు యీ జీవితమంతా బానిసత్వం చేసినా కృతజ్ఞత తీరదు. నా కళ్ళకు కమ్మిన చీకట్లు తొలగిపోయినయ్. యీ జీవితానికి యీ కాళ్ళ దగ్గిర, మొహం దాచుకునే మాత్రం స్థలమిస్తే చాలు... " అంది ఏడుస్తూ.

రాజు ఆశ్చర్యపొయ్యాడు. పులివలె తయారైన జానకి, పెంపుడు పిల్లి వలె అవుతుందని కలలో కూడా అతను భావించలేదు.

"ఛా! ఏమిటి జానకీ! లే..." అన్నాడు ఆమెను లేవదీసేందుకు ప్రత్నిస్తూ.

"సిగ్గుపడి ఛస్తున్నాను. నా పాడుమొహాన్ని మీకెలా చూపను? నన్ను క్షమించగలిగే విశాల హృదయులని కూడా తెలుసు. నన్ను క్షమించండి--" అన్నదామె.

"ఏమిటి జానకీ? సిగ్గుపడటమెందుకు? జానకీ! జీవితంలో అనేక ఘట్టాలొస్తాయ్. అందులో ఇదొకటి. ఐనా నీవేం తప్పు చేశావు కనుక క్షమించాలి?" అన్నాడు రాజు.

"నేను తప్పే చేయలేదంటుంటే, అది మీ సహృదయత్వం కావొచ్చేమో కాని, నిజం మాత్రం కాదు... నన్ను విడిచిపెట్టకండి--ఆ మాట అంటే అదే చాలు!"

"విడిచిపెట్టటమా? చాలా విచిత్రంగా మాట్లాడుతున్నావ్ జానకీ! ఏ ఆదర్శంకోసం చచ్చేందుక్కూడా సిద్ధపడ్డానో, దాన్నెలా విడనాడుతాను జానకీ?"

ఆమె అత్యంత తృప్తితో వెక్కి వెక్కి ఏడుస్తూ అతని విశాల హృదయంలో తలదాచుకుంది. ఒకరికొకరు పరిపూర్ణంగా అర్థమైన ఆ రాత్రే వారు జీవితంలో స్వర్గసౌఖ్యా లనుభవించిన మొదటి రాత్రయింది.